
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు
5
మంగళవారం 22 జూలై 2025





# ఆత్మకూరులో భారీ వర్షం

- ఉధృతంగా ప్రవహించిన వాగులు, వంకలు
- పంటపొలాల్లోనూ నిలిచిన వర్షపునీరు



ఆత్మకూరు పట్టణ శివార్లలో ఉధృతంగా ప్రవహిస్తున్న పడేవాగు

**ఆత్మకూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి):** ఆత్మకూరు ప్రాంతంలో సోమవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. ఆదివారం రాత్రి ఆకాశం మేఘావృతమైనప్పటికీ వర్షం కురవలేదు. అర్ధరాత్రి దాటిన తర్వాత నుంచి ఏకధాటిగా వర్షం పడటంతో 38.6 మిల్లీమీటర్ల మేర వర్షపాతం నమోదైంది. కాగా కొన్ని రోజులుగా చినుకుజాడ లేకపోవడంతో ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన వివిధ పంటలు ఎండుదశకు చేరుకున్నాయి. ఈ క్రమంలో వర్షం రాక అన్నదాతలకు ఎంతో ఊరటనిచ్చింది. భారీ వర్షంతో నల్లమల అటవీ ప్రాంతం బైర్లూటి సమీపంలోని రాళ్లవాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. అక్కడి నుంచి సిద్ధాపురం చెరువులోకి జలాలు చేరడంతో ప్రస్తుతం నాలుగు అడుగుల మేర నీటినిల్వలు చేరుకున్నాయి. అలాగే వరదరాజస్వామి ప్రాజెక్ట్‌లోకి కూడా వర్షపునీరు చేరింది. అంతేకాకుండా ఆత్మకూరు పట్టణ శివారులోని వాగు కూడా ఉధృతంగా ప్రవహిస్తోంది.



సిద్ధాపురం చెరువులో పెరిగిన నీటినిల్వలు

## పీజీఆర్ఎస్‌కు 168 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజకుమారి

**నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి):** కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో వివిధ సమస్యలపై 168 అర్జీలను బాధితులు అందజేసినట్లు కలెక్టర్ రాజకుమారి తెలిపారు. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధికంగా రెవెన్యూ సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయి. వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేపట్టి త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం వహించినా కఠిన చర్యలు ఉంటాయన్నారు. అర్జీదారులు ముందుగా సమీపంలోని మండల, డివిజన్ కేంద్రాల్లో అర్జీలు కూడా అందజేయవచ్చన్నారు. అక్కడ కూడా సమస్యలు పరిష్కారం కాకపోతే తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ కోరారు.

## యూరియా నిల్వలపై ఆందోళన వద్దు

**నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి):** జిల్లాలో యూరియా నిల్వలున్నాయని, రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని కలెక్టర్ రాజకుమారి భరోసానిచ్చారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్‌లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పచ్చిరొట్ట పంటలపై ముద్రించిన పోస్టర్‌లను కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పచ్చిరొట్ట పంటల ద్వారా భూసారం పెరిగి ఎరువుల కొనుగోలు ఖర్చు తగ్గుతుందన్నారు. అధిక ఎరువులు, పురుగుల మందు వాడకాన్ని తగ్గించేలా రైతుల్లో అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. జిల్లాలో మిర్చి పంట కూడా ఒకేరకం పంట వేస్తున్నారని, దీనివల్ల తెగుళ్లు పెరగుతున్నాయని అన్నారు. ఇతర రకాల వెరైటీల వాడకం ద్వారా తెగుళ్లను నివారించవచ్చన్నారు. జిల్లాలో సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులు తొందరపడి ఎక్కువ బ్యాగులు కొనుగోలు చేయవద్దన్నారు. వ్యవసాయాధికారులు సూచించిన ఎరువుల మోతాదు మేరకే కొనుగోలు చేసేవిధంగా గ్రామసభలు నిర్వహించి అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం రైతులకు బయో మందులను పంపిణీ చేశారు.

## నేడు నంద్యాలకు మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శైలజ రాక



**నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి):** ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ మంగళవారం నంద్యాల పట్టణంలో పర్యటించనున్నారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ఉదయం 11గంటలకు మహిళా హక్కులపై నిర్వహించనున్న సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరవుతారు. అనంతరం కర్నూలుకు చేరుకుని మధ్యాహ్నం 2 గంటలకు దూపాడు సమీపంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు.

## జర్మన్ భాషపై శిక్షణ

**కర్నూలు కల్చరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి):** బీఎస్సీ (నర్సింగ్) పూర్తి చేసిన మహిళా విద్యార్థులకు జర్మన్ భాషలో శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా గిరిజన సంక్షేమం, సాధికారత అధికారి కొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. వయో పరిమితి 35 ఏళ్ల లోపు ఉండాలని, బీఎస్సీ (నర్సింగ్)తో పాటు క్లినికల్‌లో రెండేళ్ల అనుభవం ఉండాలని తెలిపారు. అభ్యర్థులు రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కలిగి ఉండాలన్నారు. 10 నెలలు శిక్షణ ఉంటుందని, ఎంపికైన వారికి తిరుపతి, విశాఖపట్నం, గుంటూరులోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాల్లో వసతి ఉంటుందని తెలిపారు. శిక్షణ కాలంలో ఖర్చులు, భోజన వసతికి సంబంధించి స్టైఫండ్ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 85000 69569, 99891 20904 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

**నంద్యాల కేంద్రంగా నకిలీ సర్టిఫికెట్లు!**

- దేశ వ్యాప్తంగా సరఫరా
- బైక్‌ల రికవరీతో కదిలిన డొంక
- నలుగురు నిందితుల అరెస్టు




7

# ఎరువుల దుకాణాలపై విజిలెన్స్

- జిల్లాలో కొనసాగుతున్న దాడులు
- రికార్డులు, రసీదులు లేని విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సీజ్
- నిరంతర తనిఖీలతో షాపులు మూసేస్తున్న డీలర్లు



ఎరువుల షాపులో తనిఖీ చేస్తున్న ప్రత్యేక అధికారులు

**నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి):** నంద్యాల జిల్లాలో ఎరువులు, పురుగుల మందులు, విత్తనాల దుకాణాలపై ప్రత్యేక అధికారుల బృందం చేస్తున్న దాడులతో రిటైల్, హోల్‌సేల్ డీలర్ల గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా రెండు బృందాలుగా ఏర్పడి గత వారం రోజుల నుంచి షాపులు, గోదాములపై విజిలెన్స్ దాడులు జరుగుతున్నాయి. దీంతో గ్రామాలతో పాటు పట్టణంలోని పలు దుకాణాల డీలర్లు షాపులు మూసేసుకుంటున్నారు. మరికొందరు చాకచక్యంగా రహస్య ప్రాంతాలకు ఎరువులను తరలించి అక్కడి నుంచి రైతులకు విక్రయిస్తున్నారు. నంద్యాల పట్టణానికి సమీపంలోని షాపులు ఏకంగా దుకాణాలకు తాళం వేసి వారి వ్యాపారాలను రహస్యంగా కొనసాగిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పట్టణంలోని దుకాణాల డీలర్‌లు షాపుల వద్ద రైతులు ఎక్కువగా ఉండకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

### కఠిన చర్యలు తప్పవు



జిల్లాలో ఎక్కడైనా అక్రమంగా నిల్వ ఉంచినా, ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా విక్రయాలు చేపట్టినా కఠిన చర్యలు తీసుకుంటాం. రైతులు కూడా కొన్న ఎరువులకు తప్పనిసరిగా రసీదు పొందాలి. ప్రత్యేక అధికారుల బృందంతో నిరంతరం దాడులు నిర్వహిస్తాం. అనుమతి పొందిన షాపుల్లో కాకుండా మరే ప్రదేశంలో విక్రయించినా ఆ ఉత్పత్తులను సీజ్ చేస్తాం.

- వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయాధికారి, నంద్యాల

### అమ్మకాలు నిలుపుదల

జిల్లాలో వారం రోజుల నుంచి ప్రత్యేక అధికారుల దాడుల్లో పలు ఉత్పత్తులను సీజ్ చేసి అమ్మకాలను నిలిపివేశారు. వాటికి సంబంధించిన రికార్డులు, రసీదులు లేకపోవడంతో అమ్మకాలను నిలిపివేసి చర్యలకు ఉపక్రమించారు. విత్తనాలకు సంబంధించి ఒక తయారీదారును, ఒక హోల్‌సేల్ డీలర్‌ను, 13 రిటైల్ షాపులను తనిఖీ చేసి రూ.2.95 లక్షల విలువ చేసే 6.1 క్వింటాళ్ల విత్తనాల విక్రయాలను నిలిపివేశారు. ఎరువులకు సంబంధించి 12 హోల్‌సేల్ షాపులు, 42 రీటైల్ షాపులను తనిఖీ చేసి రూ.82.58లక్షల విలువ చేసే 258 మెట్రిక్ టన్నుల వివిధ రకాల ఎరువుల విక్రయాలను నిలిపివేశారు. పురుగుల మందులకు సంబంధించి రెండు హోల్‌సేల్ షాపులను, 38 రిటైల్ షాపులను తనిఖీ చేసి రూ.38వేల విలువ చేసే 12.5 లీటర్ల వివిధ రకాల పురుగుల మందుల విక్రయాలను నిలిపివేశారు.



పురుగుల మందుల షాపులో తనిఖీ

# బాలికలు బాగా చదువుకోవాలి

**మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి**

**నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అందిపుచ్చుకుని బాలికలు బాగా చదివి ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి విద్యార్థినులకు సూచించారు. నంద్యాలలో ఒక్కరోజు పర్యటనలో భాగంగా మంత్రి కలెక్టర్ రాజకుమారితో కలిసి నంద్యాల గిరినాథ్ సెంటర్‌లో సాంఘిక సంక్షేమ బాలికల పోస్ట్ మెట్రిక్ వసతి గృహాన్ని తనిఖీ చేశారు. బాలికలకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఒక్కో గదిలో ఎంతమంది ఉంటున్నారు? గదులు ఈ రోజు మాత్రమే శుభ్రంగా ఉన్నాయా?, రోజూ శుభ్రం చేస్తున్నారా?, మెనూ సక్రమంగా అమలవుతోందా? అని మంత్రి బాలికలను అడిగారు. అనంతరం వారితో పాటే కూర్చుని భోజనం చేశారు. మంత్రి మాట్లాడుతూ పేద విద్యార్థుల భవితకు సాంఘిక సంక్షేమ వసతి గృహాలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎస్సీ, ఎస్టీల సంక్షేమంపై ప్రత్యేక దృష్టిసారించి కృషి చేస్తున్నారని అన్నారు. హాస్టళ్లలో విద్యార్థులకు ఏ మాత్రం అసౌకర్యం కల్పించినా ఉపేక్షించబోమన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ వసతి గృహాల్లో ఉంటే ఎలాంటి ఖర్చులు లేకుండా అన్ని సౌకర్యాలతో పాటు మంచి నాణ్యమైన ఆహారం అందిస్తున్నామని అన్నారు.



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి, కలెక్టర్

## కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

**జిల్లా వ్యవసాయాధికారి**

**నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి):** నంద్యాల జిల్లాలో ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హోల్‌సేల్ డీలర్లను జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. సోమవారం జిల్లా వ్యవసాయ కార్యాలయంలో హోల్‌సేల్ డీలర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ ఈ ఏడాది ముందుగానే కాల్వలకు నీటిని విడుదల చేశామన్నారు. వర్షాలు కూడా సకాలంలో రావడంతో రైతులు అధిక సంఖ్యలో మొక్కజొన్న, మినుము, సోయాచిక్కుడు, సాలువరి సాగు చేశారన్నారు. జిల్లా అవసరాలకు అనుగుణంగా ఎరువుల వ్యాగన్లు తెప్పిస్తామన్నారు. ప్రస్తుతం జిల్లాలో మార్క్‌ఫెడ్ వద్ద 200 టన్నుల యూరియా, 1,200 టన్నుల డీఏపీ అందుబాటులో ఉన్నాయని, ఈ వారంలో మరో 3,500 టన్నుల యూరియా, డీఏపీ ఎరువులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. వచ్చిన ఎరువులను మార్క్‌ఫెడ్‌కు, డీలర్లకు సమానంగా కేటాయిస్తామన్నారు. డీలర్లు ఎఫ్‌సీవో 1985 చట్టం ప్రకారం వ్యాపారం చేసుకోవాలని, చట్టాన్ని ఉల్లంఘించి విక్రయాలు జరిపితే కఠినంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో మార్క్‌ఫెడ్ మేనేజర్ హరినాథ్‌రెడ్డి, ఏడీఏ ఆంజనేయ, ఎంఏవో ప్రసాదరావు, సాంకేతిక వ్యవసాయాధికారి శారద పాల్గొన్నారు.



డీలర్లతో సమావేశమైన వెంకటేశ్వర్లు

## రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం

**అసహనం వ్యక్తం చేసిన కేంద్ర బృందం**



వెలుగు సిబ్బందిపై అసహనం వ్యక్తం చేస్తున్న కేంద్ర బృంద లీడర్ సంతోష్‌కుమార్

**ఉయ్యాలవాడ, జూలై 21 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని ఆర్.పాంపల్లె గ్రామంలో నిర్వహించిన కేంద్రబృంద పర్యవేక్షణలో ఆయా శాఖలకు సంబంధించిన రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం కనిపించింది. నేషనల్ మోనిటరింగ్ టీమ్ లీడర్ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం గ్రామంలో పర్యటించి, కేంద్ర ప్రభుత్వ పనులు వాటికి సంబంధించిన ఆయా శాఖల రికార్డులను పరిశీలించారు. ముందుగా ఉపాధి హామీ కూలీలతో సంభాషించారు. పని దినాలు ఎన్ని కల్పిస్తున్నారు? పనికి తగ్గ వేతనం ఇస్తున్నారా లేదా? ఉపాధి హామీ పని బాగుందా? అని వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం 2022-23, 2023-24, 2024-25 ఏడాదిలకు సంబంధించిన ఉపాధి రికార్డులను వారు పరిశీలించారు. వాటిలో కొన్ని పనులు పూర్తి చేయకుండానే ఎంబుక్‌లు క్లోజ్ చేసినట్లు గుర్తించి అసహనం వ్యక్తం చేశారు. అలాగే గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించి గ్రామ తీర్మానం రాయటం వచ్చా? రాదా? అని గ్రామ కార్యదర్శిని ప్రశ్నించారు. దీనికి ఆమె మౌనం వహించారు. అనంతరం వెలుగు శాఖకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రూ.5 లక్షల సీఐఎఫ్ రికవరీ బిల్లులు, గ్రామ వీవోకు సంబంధించిన రికార్డులు ఇవ్వాలని ఏపీఎంను, సీసీలను అడుగగా వారు తమ వద్ద లేవని, గతంలో పనిచేసిన వీవోఏ వద్ద ఉన్నాయని సమాధానం ఇచ్చారు. అలాగే గ్రామైక్య సంఘం లీడర్లు, సభ్యులను చూపించాలని అడుగగా, వారు పలు కారణాల వల్ల రాలేదని చెప్పడంతో వారిపై తీవ్ర స్థాయిలో అసహనం వ్యక్తం చేశారు. వెలుగు సిబ్బంది పనితీరుపై డీఆర్‌డీఏ పీడీకి ఫిర్యాదు చేస్తామన్నారు. కేంద్ర బృందం సభ్యుడు సూర్యకంట ప్రధాన్, సర్పంచ్ లక్ష్మీదేవి, ఎంపీటీసీ శివమ్మ, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, తహసీల్దారు సువర్ణాదేవి, ఉపాధి ఏపీడీ సాంబశివరావు, ఏపీవోలు హరికృష్ణ, రవిప్రకాష్, పీఆర్ ఏఈ వెంకటయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రణీత్‌కృష్ణ, వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.




# పన్ను ఎగవేతదారులు

- అధికారుల అక్రమ వసూళ్లు
- ప్రభుత్వ ఖాజానాకు గండి
- యథేచ్ఛగా సరుకుల అక్రమ రవాణా

**కర్నూలు న్యూసిటీ, జూలై 21(ఆంధ్రజ్యోతి):** ఉమ్మడి కర్నూలు జిల్లాలో పన్ను ఎగవేతదారులు ఎక్కువయ్యారు. వాణిజ్య పన్నుల శాఖలోని లొసుగులను గుర్తించి వ్యాపారులు అక్రమంగా వివిధ రకాల సరుకులను అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఎగవేతదారులతో వాణిజ్యపన్నుల శాఖ అధికారులు అక్రమంగా డబ్బులు వసూలు చేస్తూ ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారు. జిల్లాకు తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాదు, కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్ తదితర ప్రాంతాల నుంచి నిత్యం పెద్ద ఎత్తున సరుకు రవాణా అవుతోంది. ఇదేక్రమంలో వ్యాపారులు ఇష్టానుసారంగా అధికారులను అడ్డం పెట్టుకుని పన్ను ఎగ్గొడుతున్నారు. ఇందులో చాలా సరుకులు రవాణా చేసే వాహనాలు ఈ-వేబిల్, ఇన్‌వాయిస్ లేకండా రూ.కోట్లు విలువ చేసే సరుకును వివిధ రాష్ట్రాల నుంచి ఉమ్మడి జిల్లాలోకి తీసుకువస్తున్నట్లు సమాచారం. ప్రధానంగా ఉమ్మడి జిల్లాలోని కర్నూలు జిల్లా కేంద్రం, నంద్యాల జిల్లా కేంద్రంలోకి ఎక్కువ శాతం అక్రమంగా సరుకు రవాణా అవుతున్నట్లు సమాచారం. ఎలాంటి బిల్లులు చూపించకుండా జీరో దందా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ప్రతి సంవత్సరం రూ.150 కోట్లకు పైగా పన్ను ఎగ్గొడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. కొందరు అధికారులు లక్షలకు ఆశ పడి కోట్ల జీఎస్టీని ప్రభుత్వ ఖజానాకు రాకుండ అడ్డుకుంటున్నారు. అధికారులు ఖచ్చితంగా తనిఖీలు చేపడితే ఉమ్మడి జిల్లాలో సంవత్సరానికి రూ.250 కోట్లకు పైగా పన్నులు వసూలయ్యే అవకాశాలు ఉన్నాయి.





### ఒకే బిల్లుతో అక్రమ రవాణా

ఒక్క ఈ-వేబిల్లు ఒక్కరోజు గడువు సమయంలో 200 కిలోమీటర్ల పరిధి వరకు ఉంటుంది. అయితే మరో వే బిల్లు రెండు రోజుల వరకు గడువు ఉంటుంది. అంటే 400 కిలోమీటర్లకు వరకు ఉంటుంది. ఈ మేరకు కొంతమంది వ్యాపారులు సిమెంట్, స్టీల్, ఐరన్ ఓర్‌తో పాటు వివిధ ఉత్పత్తి వస్తువులను ఎక్కువగా ఆయా పరిశ్రమల నుంచి రవాణా చేస్తుంటారు. కొన్ని పరిశ్రమలు సరుకు రవాణా ఉత్పత్తి తక్కువగా చూపిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండికొడుతుంటాయి. టోల్‌గేట్ లేని ప్రాంతాల్లో ఇలాంటి దోపిడీ మరీ ఎక్కువగా ఉంటుంది. ఒకే వే బిల్లుతో పదిరోజులు సరుకు రవాణా చేస్తుంటారు. ఈ వే బిల్లులో ఈ రోజు సరుకు రవాణా చేస్తే ఆ రోజు తేదీ తప్పకుండా ఉంటుంది. అయితే కొందరు వ్యాపారులు అధికారులతో కుమ్మక్కై తనిఖీ సమయంలో వే బిల్లును అధికారుల వద్ద సీల్ వేయించుకోకుండా లంచాలు సమర్పించుకుని వెళ్తుంటారు. సరుకు రవాణా క్షేమంగా గమ్యస్థానానికి చేరిన తరువాత ఈ వేబిల్లులో సరుకు విలువ తక్కువ వేసి ప్రభుత్వానికి పన్ను చెల్లిస్తుంటారు. ఈ క్రమంలో సిమెంట్ లారీ లోడు కనీసం రూ.84వేలు ఉంటుంది. 18 శాతం జీఎస్టీ రూ.15,120 కలుపుకుని రూ.99,120 అవుతుంది. అయితే కొందరు వే బిల్లును అధికారులకు చూపించకుండా బిల్లులో సిమెంటు స్థానంలో ఏదో ఒకరకమైన వేస్ట్‌జీని రవాణా చేసినట్లు అందులో సరుకు విలువ రూ.10 వేలు చూపిస్తారు. ఇలా ఒక్క సిమెంట్ లారీ లోడ్ నుంచి రూ.14వేలు ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారు. జిల్లా మీదుగా ప్రతిరోజు వందల టన్నుల సిమెంటు రవాణా అవుతోంది.

### వసూళ్లపై ఉన్నతాధికారుల ఆరా

గతంలో వాహనాల తనిఖీలు నేరుగా చేపట్టేవారు. అయితే ప్రస్తుతం రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తేనే తనిఖీలు నిర్వహిస్తున్నారు. రెగ్యులర్ జీఎస్టీ అధికారులకు తమ తమ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించేలా జిల్లా అధికారులు విధులు కేటాయిస్తున్నారు. ఈ మేరకు జీఎస్టీ అధికారులు వాహనాలను తనిఖీలు ఉదయం నుంచి మరుసటి రోజు ఉదయం వరకు నిర్వహిస్తారు. ఈ క్రమంలో రాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజామున 4 గంటల పరిధిలోనే ఎక్కువగా దొంగ సరుకు రవాణా అవుతోంది. వ్యాపారుల తరహాలోనే అధికారులు రాత్రి నుంచి మరుసటి రోజు తెల్లవారుజామున వరకు వాహనాలను తనిఖీ చేస్తూ రూ.లక్షలు దండుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జీఎస్టీ పన్ను వసూళ్ల పేరుతో అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారు. వాహనదారుల నుంచి భారీ ఎత్తున ముడుపులు వసూలు చేస్తున్నట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్తున్నాయి. ఈ మేరకు అక్రమార్జనకు పాల్పడుతున్న అధికారుల వివరాలపై ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం.

- మిగతా 6వ పేజీలో



# మెదడును కాపాడుకుందాం

శరీరంలో గుండె తర్వాత అత్యంత ముఖ్యమైన అవయవం మెదడు. ఏ భాగం పని చేయాలన్నా మెదడే కీలకం. మెదడు కనుక మొరాయిస్తే ఇక మనిషి ఏం చేయలేని పరిస్థితి. అందుకే మెదడును ఆరోగ్యంగా ఉంచుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్రస్తుతం మెదడు ఆరోగ్యం ప్రమాదంలో పడుతోంది. కొందరు దీర్ఘకాలికంగా ఉన్న అధిక రక్తపోటు కారణంగా బ్రెయిన్ స్ట్రోక్‌కు గురవుతున్నారు. ఉమ్మడి జిల్లాలో కూడా మెదడుకు సంబంధించిన వ్యాధులతో బాధపడుతున్న కేసులు పెరుగుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా మెదడుపై అవగాహన పెంచడానికి ప్రతి సంవత్సరం జూలై 22న అంతర్జాతీయ మెదడు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది అన్ని వయస్సుల గల వారికి మెదడు ఆరోగ్యం దారి అన్న నినాదాన్ని ఇచ్చింది. అంటే మెదడు అనేది అన్ని వయస్సుల వారికి ఎంతో అవసరమో అన్నది ఈ థీమ్ తెలియజేస్తుంది.

- కర్నూలు హాస్పిటల్ (ఆంధ్రజ్యోతి)

### బ్రెయిన్ స్ట్రోక్



ఎలాంటి ముందస్తు సూచనలు లేకుండా మెదడు ఆక్సిజన్ పోషకాలను తీసుకెళ్లే రక్తనాళాలకు అవరోధం కలగడం, లేదా చిట్లడం వల్ల మెదడులోని కొంత భాగం మరణానికి దారి తీసి స్ట్రోక్‌కు గురవుతున్నారు. రక్తనాళంలో అడ్డంకుల కారణంగా ఇస్కీమిన్ స్ట్రోక్ వస్తుంది. పక్షవాతానికి గురయ్యే వారిలో 80 శాతం ఈ రకమైన పక్షవాతానికి గురవుతారు. అదేవిధంగా రక్తనాళం చిట్లడం వల్ల హెమరేజిక్ స్ట్రోక్ సంభవిస్తుంది. ఒక వైపు చేయి, కాలు పని చేయకపోవడం, ఫలితంగా నడవడానికి ఇబ్బంది పడటం, ఆకస్మాత్తుగా తల తిరగడం, శరీరం బ్యాలెన్స్ కోల్పోవడం, మూతి ఒక వైపునకు వంకరగా పోవడం దీని లక్షణాలు. స్ట్రోక్ అనేది అత్యవసర పరిస్థితి కనుక.. స్ట్రోక్ రోగ నిర్ధారణ వేగంగా జరగాలి. ఎలాంటి రకమైన స్ట్రోక్ వచ్చిందో తెలుసుకోవడం తప్పనిసరి. దీని కోసం సిటీ స్కాన్, ఎంఆర్ఐ బ్రెయిన్ వంటి పరీక్షలు అవసరం అవుతాయి.

- ● పెరుగుతున్న బ్రెయిన్ కేసులు
- ● నేడు అంతర్జాతీయ మెదడు దినోత్సవం

### ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- ● నిద్ర లేచే సమయంలో తలనొప్పి, చూపు మందగింపు, శరీరం ఒక వైపు కుంగినట్లు అనిపించడం ఉంటే వైద్యులను సంప్రదించాలి.
- ● వారానికి కనీసం ఐదు రోజులు వ్యాయామం గానీ, జాగింగ్ గానీ, నడక, సైక్లింగ్ రోజు 30 నిమిషాలకు తక్కువ కాకుండా చేయాలి.
- ● రోజుకు 7 - 8 గంటలు గాఢ నిద్ర తప్పనిసరి.
- ● చేపలు, బ్లూబెరిస్, గుమ్మడికాయ, నారింజ, వాల్‌నట్స్, బ్రోకలి, గుడ్లు, విటమిన్-బీ-12 గల ఆహారాలను తీసుకోవాలి.

### చికిత్స విధానాలు

చికిత్స యొక్క విధానం స్ట్రోక్ రకంపై ఆధారపడి ఉంటుంది. రక్తనాళంలో అడ్డంకుల వల్ల వచ్చే స్ట్రోక్‌లో (ఇస్కీమిన్ స్ట్రోక్) థాంబోలైటిక్ థెరపి, మెకానికల్ థాంబెక్టమీ వంటివి ఉంటాయి. ఇలాంటి చికిత్స వల్ల తొందరగా సాధారణ స్థితికి వచ్చే అవకాశం ఉంటుంది. థ్రాంబోలైటిక్ థెరపీలో అల్టెప్లేజ్ లేదా టీనక్టప్లేజ్ అనే ఇంజెక్షన్ ఇవ్వడం వల్ల రక్తప్రవాహాన్ని పునరుద్ధరించవచ్చును. ఈ ఇంజెక్షన్ లక్షణాలు కనిపించిన 4-5 గంటల్లో ఇవ్వాలి. మెకానికల్ థాంబెక్టమిలో థాంబోలైసిస్ ఇంజక్షన్ తొలగించలేని పెద్దగడ్డలను తొలగించవచ్చును. కరోటిడ్ ఎండార్టెక్టమి అనే ట్రీట్‌మెంట్‌తో స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గించవచ్చును. రక్తం పలుచగా చేసే మందులు తీసుకోవాలి.

### కర్నూలు జీజీహెచ్‌కు బ్రెయిన్ కేసులు

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని న్యూరోసర్జరీ విభాగం రాయలసీమ జిల్లాలోనే ఎంతో పేరొందింది. న్యూరోసర్జన్ (ఓపీ.నెం.5) ప్రతి బుధ, శనివారాల్లో ఓపీ ఉంటుంది. ప్రతి ఓపీకి 300 మంది వస్తుండగా.. వీరిలో 150 మంది బ్రెయిన్, తలనొప్పితో బాధపడుతూ వస్తుంటారు. ఇక బ్రెయిన్ ట్యూమర్ కేసులు 10 మంది అడ్మిషన్ పొందుతుంటారు. న్యూరోసర్జరీ విభాంలో 60 పడకలు ఉండగా.. ఇన్‌చార్జి హెచ్‌వోడీ డాక్టర్ రాంబాలాజీ నాయక్, అసోసియేట్ ప్రొఫెసర్ సురేంద్ర వర్మ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పుండరీకాక్షయ్య, వరుణ్ కుమార్ రెడ్డి, అచ్యుత్‌తో పాటు ఐదుగురు పీజీలు పని చేస్తున్నారు.



### అందుబాటులో అత్యాధునిక వైద్యం



మెదడులోని బ్రెయిన్ స్ట్రోక్ తలనొప్పి, మూర్ఛ, పార్కిన్సన్ వ్యాధులు మతిమరుపు జబ్బులకు ఇటీవల కాలంలో అత్యాధునిక చికిత్సలకు అందుబాటులోకి వచ్చాయి. స్ట్రోక్ వచ్చిన రోగికి నాలుగున్నర గంటలలోపు థాంబోలైసిస్ ఇంజెక్షన్ ఇస్తే రోగి కోలుకుంటారు. ఇక 24 గంటలలోపు మెకానికల్ థాంబెక్టమి ఇంజెక్షన్ వేస్తే రోగి కోలుకునే అవకాశం ఉంది.

- చల్లపల్లె బాబురావు, న్యూరాలజిస్టు, కిమ్స్, కర్నూలు

### తలనొప్పిని నిర్లక్ష్యం చేయొద్దు



మెదడుకు సంబంధించిన వ్యాధులు అన్ని ప్రమాదకరం. తలనొప్పి ఉన్న ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి. అధిక రక్తపోటు మెదడులో చిట్లిపోవడం, ఫిట్స్ కేసులు కూడా న్యూరోసర్జరీ విభాగానికి వస్తుంటాయి. మెదడుకు సంబంధించిన వ్యాధులను సిటీ స్కాన్, ఎంఆర్ఐ, బ్రెయిన్ పరీక్షల ద్వారా నిర్ధారించవచ్చు. కొన్ని వ్యాధులకు మందులతో నయం కాగా, మరి కొన్ని కేసులకు ఆపరేషన్ అవసరమవుతుంది. మెదడుకు సంబంధించి ప్రభుత్వ ఆసుపత్రుల్లో పక్షవాతం కేసుల కోసం ప్రభుత్వం ఉచితంగా థ్రాంబోలైసిస్ ఇంజెక్షన్‌ను అందుబాటులో ఉంచింది.

- డాక్టర్ రాంబాలాజీ నాయక్, ఇన్‌చార్జి హెచ్‌వోడీ, న్యూరోసర్జరీ విభాగం, కర్నూలు జీజీహెచ్

### జన్యులోపాలు కారణం



పక్షవాతానికి గురయ్యేవారిలో చాలా మందికి సరైన ఆహార అలవాట్లు లేకపోవడం ఒక కారణం. జన్యుపరమైన కారణాలతో కొందరు చిన్న వయస్సులోనే బాధితులవుతున్నారు. మన దేశంలో 10 శాతానికి పైగా మరణాలకు బ్రెయిన్ స్ట్రోక్ కారణమవుతున్నారు. పక్షవాతానికి గురై చికిత్స పొంది ఆరోగ్యం మెరుగుపడ్డ వారిలో 30 శాతం మంది వరకు తిరిగి బాధితులవుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

- డాక్టర్ నాగసురేష్, న్యూరాలజిస్టు, మెడికవర్, కర్నూలు

## మార్గదర్శకుల వివరాలు ప్రతి అధికారి వద్ద ఉండాలి: కలెక్టర్




మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): పీ4 పథకానికి సంబంధించి మార్గదర్శకుల వివరాలు ప్రతి మండల స్థాయి అధికారి వద్ద ఉండాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్‌అన్నిశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా ఏ శాఖకు సంబంధించి అయినా అక్రమ నిర్మాణాలు ఉంటే తొలగింపునకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక అధికారులు బంగారు కుటుంబాల ఇంటికి వెళ్లి పీ4 యాప్‌లు వారి వివరాలు నమోదు చేయాలన్నారు. జిల్లాలో 43,041 బంగారు కుటుంబాలు నమోదయ్యాయని తెలిపారు. మరో మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మట్టితో నిర్మించిన గృహాల యజమానులకు వీఆర్వోల ద్వారా నోటీసు అందజేయాలని తహసీల్దార్‌లను ఆదేశించారు. రాత్రిపూల మట్టిగృహాల్లో నిద్రపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా చెరువు కట్టలు బలహీనంగా ఉంటే వాటిని సరిచేసేందుకు సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నీరు కలుషితం అయ్యే అవకాశం ఉందని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని వైద్యఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్‌శాఖ అధికారులను ఆదేశించారు. తల్లికి వందనం నగదు అనేక మంది లబ్ధిదారులకు జమ కాలేదని ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిపై సంబంధిత పత్రాలను స్థానిక సచివాలయాల్లో అందజేసేలా ఆయాశాఖల అధికారులు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. పీఎం సూర్యఘర్ పథకం ద్వారా 26 మండలాలకు 26 బ్యాంకులు లబ్ధిదారులకు రుణాలను మంజూరు చేయడానికి ముందుకు వచ్చాయని తెలిపారు. సమావేశంలో డీఆర్వో రాముినాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నేడు దుర్వేశి గ్రామానికి మంత్రి ఆనం రాక



నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మంగళవారం గడివేముల మండలం దుర్వేశి గ్రామంలో పర్యటించనున్నారు. గ్రామంలో జరిగే 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. ఉదయం 11:30 గంటలకు దుర్వేశి గ్రామానికి ఎమ్మెల్యే గౌరుచరితతో పాటు నియోజకవర్గ ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పాల్గొంటారని మండల టీడీపీ నాయకులు తెలిపారు.

## జాతీయ జెండాకు 78 వసంతాలు

ఆత్మకూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): మన దేశ కీర్తిప్రతిష్టలను చాటుతూ.. ప్రతి ఏటా జనవరి 26న జరిగే గణతంత్ర్య దినోత్సవ, ఆగస్టు 15న జరిగే స్వాతంత్ర్య దినోత్సవాలను పురస్కరించుకుని దేశవ్యాప్తంగా ఎగిరే త్రివర్ణ పతాకానికి 78 వసంతాలు పూర్తి అయ్యాయి. ప్రతి దేశానికి తమకంటూ ఓ ప్రత్యేకమైన జాతీయ పతాకాన్ని రూపొందించుకునేలా ఆనవాయితీ నడుస్తోంది. అందులో భాగంగానే మనదేశానికి కూడా ఓ జాతీయ పతాకం నిర్మించుకోవాలన్న తలంపు ఒక ఆంధ్రుడితో సాధ్యపడింది. జాతీయ పతాకంలో మూడు రంగులను మిళితం చేసి భిన్నత్వంలో ఏకతత్వాన్ని ప్రతిబింబిస్తూ.. సర్వమతాలకు తగిన ప్రాధాన్యతనిస్తూ.. సత్యం, ధర్మం, న్యాయం నియమాలు ఉట్టిపడేలా 24 ఆకుల నీలిఆకాశ రంగు గల ప్రగతి చక్రంతో తీర్చిదిద్దబడింది మన ముువ్వన్నల జెండా. దేశ రాజధానీ ఢిల్లీలోని ఎర్రకోట నుంచి కుగ్రామంలోని ప్రాథమిక పాఠశాల వరకు జాతీయ జెండా ఎగిరేందుకు కీలక పాత్ర పోషించిన మహోన్నత వ్యక్తి మన ఆంధ్రుడే కావడం మనమంతా గర్వపడాలి. కృష్ణాజిల్లా మచిలీపట్నం మొవ్వ మండలంలోని భటపెనుమర్రు గ్రామానికి చెందిన హనుమంతరాయుడు, వెంకటరత్నమ్మల దంపతుల కుమారుడు పింగళి వెంకయ్య కొన్ని రంగులతో కూడిన ఓ జెండాను రూపొందించారు. ఆ జెండాను మొట్టమొదటి సారిగా 1916లో లక్నోలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో వెంకయ్య తయారు చేసిన జాతీయ జెండానే ఎగురవేశారు. 1919లో జలంధర్ వాస్తవ్యులైన లాలాహన్స్‌రాజ్ మన జాతీయ పతాకంపై రాట్నం చిహ్నం ఉంటే బాగుంటుందని సూచించగా గాంధీజీ దాన్ని అంగీకరించారు. 1921లో అఖిల భారత





### నేడు జాతీయ పతాక ఆవిష్కరణ దినోత్సవం

కాంగ్రెస్ సమావేశాలు బెజవాడలో జరిగాయి. గాంధీజీ వెంకయ్యను ఆ సమావేశానికి పిలిపించి కాషాయం, ఆకుపచ్చ రంగులు కలిగి, మధ్య రాట్నం(చరాఖా)గల ఒక జెండాను చిత్రీకరించమని కోరారు. మహాత్ముడి సూచన మేరకు ఒక జెండాను ఆయన రూపొందించారు. పింగళి వెంకయ్య చేతుల మీదుగా రూపొందించిన జెండా జాతీయ పతాకంగా రాజ్యాంగ ముద్రను వేసేందుకు 1947 జూలై 22వ తేదీన భారత రాజ్యాంగ సభలో నెహ్రూ జాతీయ జెండా గురించి తీర్మానం చేశారు. అయితే ఇందులో మునుపటి త్రివర్ణ జెండాలోని రాట్నాన్ని తొలగించి దాని స్థానంలో ఆశోకుని ధర్మచక్రాన్ని చిహ్నంగా ఇమిడాల్చలని ప్రతిపాదించగా రాజ్యాంగం ఇందుకు ఆమోదించింది. కాగా చిహ్నం మార్పు తప్పితే.. పింగళి వెంకయ్య రూపొందించిన జెండాకే రాజ్యాంగం ఆమోదముద్ర వేసింది. కాగా అశోకుని ధర్మచక్రం మన పూర్వ సంస్కృతికి నిదర్శనం. దీంతో ఈ నెల 22వ తేదీ నాటికి మన జాతీయ జెండా 78 వసంతాలను పూర్తి చేసుకుంది.

## విజయవాడ- కర్నూలు సర్వీసులు పెంచాలి

కేంద్రమంత్రిని కోరిన ఎంపీ బైరెడ్డి శబరి



కేంద్ర మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ బైరెడ్డి శబరి

నంద్యాల రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ఓర్వకల్లు విమానాశ్రయం నుంచి ప్రతిరోజూ విజయవాడకు విమాన సర్వీసులు నడపాలని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి కోరారు. సోమవారం ఢిల్లీలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజయవాడకు వెళ్లే ప్రయాణికులకు అనుకూల సమయంలో మార్పులు చేయాలని కోరారు. గతంలో కేంద్ర మంత్రి హామీ మేరకు ఉయ్యలవాడ నరసింహారెడ్డి పేరు పెట్టాలని కోరగా త్వరలోనే అధికారికంగా విమానయాన శాఖ ప్రకటన చేస్తుందని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. అదేవిధంగా సోమవారం నుంచి శుక్రవారం వరకు చెన్నైకు విమాన సర్వీసును కొనసాగించాలని మంత్రిని కోరినట్లు ఎంపీ బైరెడ్డి తెలిపారు.

## పన్ను ఎగవేతదారులు




(5వ పేజీ తరువాయి)

ముఖ్యంగా వాణిజ్య పన్నుల శాఖకు సంబంధించి 5,12,18,28 శాతం జీఎస్టీ స్లాబ్‌లను కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. వీటిలో అధికంగా పన్ను వసూలు అయ్యేది 18,28 శాతం స్లాబ్ నుంచే...అయితే ఎక్కువగా ఈ స్లాబ్‌ల ద్వారానే పన్ను ఎగ్గొడుతున్నారు. సిమెంటు, ఐరన్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్లు, బ్యాటరీలు, ఏసీల, ఫ్రిజ్‌లు, సిగరెట్లు వీటి పరిధిలో ఉంటాయి. ఎక్కువ మొత్తంలో జీఎస్టీ చెల్లించాల్సి ఉండటంతో వ్యాపారులు సరుకు రవాణాదారులు అధికారులతో కుమ్మక్కై అక్రమాలకు పాల్పడుతుంటారు. రూ.70 లక్షల సరుకు రవాణా చేస్తే కేవలం రూ.20 నుంచి రూ.30 లక్షల వరకు సరుకుకు సంబంధించి పన్ను చెల్లిస్తారు.

### అందినకాడికి దోచుకో!

జిల్లాకు వచ్చే సరుకులకు ఇన్వాయిస్, ఈ-వేబిల్ ఉంటుంది. రూ.40 లక్షలు విలువ చేసే సరుకులో రూ.15 లక్షలకు సంబంధించిన బిల్లులే ఉంటాయి. హైదరాబాద్ నుంచి కర్నూలుకు సరుకు రవాణా చేసే వాహనాలు మిర్యాలగూడ, నల్గొండ, జోగులాంబ గద్వాల తదితర ప్రాంతాలకు వెళ్తుంటాయి. అక్కడి నుంచి మరో సరుకును తీసుకుని వస్తాయి. ఆ సమయంలో టోల్‌గేట్లు లేకుండా సరుకు రవాణా చేస్తున్న వాహనాల వివరాలు వాణిజ్య పన్నుల శాఖ అధికారులకు చేరుతుంది. అధికారులు వెంటనే ఆ వాహనాలు ఎక్కడున్నాయో గుర్తిస్తారు. వీటిని పరిశీలించి ఆ వాహనంలో రూ.30 లక్షల విలువైన సరుకుకు జీఎస్టీ వసూలు చేయాలి. కానీ పన్ను వసూలు చేయకుండా వాహనదారుల నుంచి పెద్ద ఎత్తున ముడుపులు తీసుకుని పంపుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫలితంగా అటు అధికారికి.. ఇటు వ్యాపారికి లబ్ధిచేకూరడంతో ప్రభుత్వ ఖజానాకు గండిపడుతోంది.

### అలాంటి వాహనాలను సీజ్ చేస్తాము



జీఎస్టీ చెల్లించకుండా అక్రమంగా వస్తువులను రవాణా చేసే వాహనాలను పట్టుకుని సీజ్ చేస్తాము. గతంలో నేరుగా తనిఖీలు చేపట్టేవాళ్లం. ప్రస్తుతం రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తేనే తనిఖీలు నిర్వహించాలి. రెగ్యులర్ జీఎస్టీ అధికారులకు తమ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించేలా విధులు వేస్తున్నాం. అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాలు ఫెనాల్టీ చెల్లించని పక్షంలో వస్తువులను స్వాధీనం చేసుకుని పంపుతాం. అనంతరం స్వాధీనం చేసుకున్న వస్తువులను వేలం వేస్తాం.

-జె.నీరజ, వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్

## గడువులోపు సమస్యలు పరిష్కరించాలి: ఎస్పీ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నంద్యాల టౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): నిర్దీత గడువు లోగా సమస్యలను పరిష్కరించాలని ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా పోలీసు అధికారులకు సూచించారు. నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదులు పరిష్కార వేదిక నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ 103 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఉద్యోగం ఇప్పిస్తామని డబ్బులు తీసుకొని మోసం చేయడం, పొలం తగాదాలు, అన్నదమ్ముళ్ల ఆస్తి తగాదాలు తదితర ఫిర్యాదుల అందినట్లు తెలిపారు. చట్టపరిధిలో సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సర్వాంగ సుందరంగా లక్ష్మీనరసింహస్వామి ఆలయం

- ● రామ్‌కో సిమెంట్ ఆధ్వర్యంలో ఆలయ జీర్ణోద్ధరణ
- ● రూ.7 కోట్లతో పనులు
- ● 27 నుంచి ప్రతిష్ఠాపన మహోత్సవాలు



జీర్ణోద్ధరణ అనంతరం నూతన శోభ సంతరించుకున్న ఆలయం

కొలిమిగుండ్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయలతో స్వయంగా ప్రతిష్ఠించిన మహిమాన్విత లక్ష్మీనరసింహస్వామి ఆలయం తిరిగి నూతన శోభను సంతరించుకుంది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అహోబిలం, కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయాల తర్వాత అంతే ప్రాధాన్యత కలిగింది కొలిమిగుండ్ల లక్ష్మీ నృసింహ కొండపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయం. అయితే కాలక్రమేణా వేలాది ఎకరాల ఆలయ మాన్యం భూములు కరిగి, పరుల్లోకి రావడం, ఆలయం శిథిలావస్థకు చేరడంతో ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ ఆలయం ప్రాశస్త్యం కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో నాలుగేళ్ల క్రితం గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు రామ్‌కో సిమెంట్ పరిశ్రమ ఆలయ జీర్ణోద్ధరణకు ముందుకొచ్చింది. పరిశ్రమ యజమాన్యం స్వామిపై భక్తితో ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని, అత్యంత భక్తి శ్రద్ధలతో ఆలయ జీర్ణోద్ధరణ చేపట్టి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. రూ.7కోట్ల నిధులతో ఈ పనులు చేపట్టడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ గర్భగుడి ప్రాధాన్యత దెబ్బతినకుండా అధునాతన టెక్నాలజీతో ఆలయ జీర్ణోద్ధరణ పనులు చేపట్టారు. ఆలయ గోడలపై పురాతన శిల్పకళా సంపదకు నూతన మెరుగులు దిద్దడంతో లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి నూతన శోభ సంతరించుకుంది. గతంలో మూడంతస్తులున్న రాజగోపురాన్ని నూతన హంగులతో 5అంతస్తులుగా నిర్మించారు. స్వామి వారి మెట్ల మార్గాన్ని ఒకవైపునకు చేర్చి, ఆలయ ప్రాంగణం మరింత విస్తరించారు. నూతన రంగులు, విద్యుత్ లైట్లతో ఆలయం సర్వం సిద్ధమైంది. దశాబ్దాల అనంతరం లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి పూర్వ వైభవం రావడంపట్ల గ్రామస్థులు, వివిధ ప్రాంతాల భక్తుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.



పూజలందుకుంటున్న లక్ష్మీనరసింహస్వామి

### 27 నుంచి ఉత్సవాలు

రామ్‌కో సిమెంట్ ఆధ్వర్యంలో దేవదాయశాఖ పర్యవేక్షణలో ఈనెల 27 నుంచి ఆలయ ప్రారంభోత్సవాలు వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేపడుతున్నారు. మూడు రోజుల పాటు ఆలయ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, హోమాలు, సంప్రదాయ పూజలు నిర్వహించనున్నారు.

# భయం గుప్పిట్లో కొల్లంపల్లి తండా..!



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేసున్న కొప్పంపల్లి తండా రైతులు

- బ్లాస్టింగు శబ్దాలతో దద్దరిల్లుతున్న గ్రామం
- ఇళ్లకు పగుళ్లు, ధ్వంసమవుతున్న రోడ్లు
- చెరువు ఫోర్‌షోర్ ఏరియాను అక్రమించి రహదారి నిర్మాణం
- క్వారీల నుంచి రక్షణ కల్పించాలని రైతుల ఆవేదన

**కర్నూలు, జూలై 21 (ఆంధ్రజ్యోతి):** వెయ్యిలోపు జనాభా ఉన్న కొల్లంపల్లి తండాకు ఇప్పుడు క్వారీ కష్టమొచ్చింది. అర కిలోమీటరు దూరంలో క్వారీ, క్రషర్లు ఏర్పాటు చేయడంతో గ్రామం మొత్తం నిత్యం దద్దరిల్లిపోతోంది. క్వారీలో బ్లాస్టింగ్ చేపడుతుంటంతో ఆ శబ్దాలకు ఊరు మొత్తం బెంబేలెత్తిపోతోంది. వచ్చిపోయే టిప్పర్ల వేగానికి రహదారులు ధ్వంసమవుతున్నాయి. గ్రామానికే పెను కుంపటిగా మారిన క్వారీల నుంచి రక్షణ కల్పించాలని, చెరువుకు హంద్రీనీవా ద్వారా నీళ్లు విడుదల చేయాలని కోరుతూ ఆ పల్లె రైతులు అధికారులను వేడుకుంటున్నారు. తాజాగా సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టరు పి.రంజిత్ బాషాకు ఎదుట తమ ఆవేదన వ్యక్తం చేశారు.

కల్లూరు మండలం ఉల్లిందకొండ పంచాయతీ మజరా గ్రామం కొల్లంపల్లి తండాలో 150 కుటుంబాలు, వెయ్యిలోపు జనాభా ఉంటుంది. 85 శాతానికి పైగా గిరిజన తెగకు చెందిన ప్రజలు నివాసం ఉండే ఆ గ్రామం ప్రధాన జీవనాధారం పశుపోషణ, వ్యవసాయం. సమీపంలో సుమారుగా వెయ్యి ఎకరాలకు వరకు ప్రభుత్వ భూములు ఉన్నాయి. వివిధ పంటలు పండిస్తూ జీవనం సాగిస్తున్న ఆ గ్రామస్థులకు నాలుగేళ్ల క్రితం గ్రామానికి అర కిలోమీటర్లులో ఏర్పాటు చేసిన ఓ క్వారీ, క్రషర్ యూనిట్ కుంపటిలా మంట రేపింది. కంకర క్రషింగ్ కోసం సమీపంలోనే క్వారీ మైనింగ్ కోసం గనులు భూగర్భ వనరుల శాఖ అనుమతులు తీసుకున్నారు. అయితే బోరు ఘాతాలు వేసి, సాయంత్రం 4-6 గంటల మధ్యలో బ్లాసింగ్ చేస్తుండడంతో భారీ శబ్దాలకు ఊరుఊరంతా దద్దరిల్లుతుందని, ఇంట్లో సామాన్లు కింద పడిపోతున్నాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు 20-30 టన్నుల కంకరతో వెళ్లే టిప్పర్ల వేగం ఒత్తిడికి ఉల్లిందకొండ నుంచి కొల్లంపల్లి గ్రామం వరకు దాదాపు 4 కిలోమీటర్లు రహదారి గుంతలమయంగా మారింది. ఆ రోడ్డులో ఆటోలను మళ్లించేందుకు కూడా డ్రైవర్లు జంకుతున్నారు. ఈ క్వారీ మాకొద్దు.. మా గ్రామానికి రక్షణ కల్పించాలని పలుమార్లు అడ్డుకున్నా ప్రయోజనం లేదు.

క్వారీ యజమానికి ఉన్న రాజకీయ కలుకుబడితో పోలీసులు, అధికారులు భయపెట్టిస్తున్నారని గ్రామస్థులు ఏకరువు పెడుతున్నారు. గ్రామానికి జీవనాడి అయిన చెరువు గట్టుపై లారీలో తిప్పుతున్నారని, ఏ క్షణంలో గట్టు తెగిపోతుందో అని భయాందోళలను వ్యక్తం చేస్తున్నారు. చెరువు ఫోర్‌షోర్ ఏరియాను అక్రమించి క్వారీకి రోడ్డు ఏర్పాటు చేసుకున్నారని, ప్రశ్నిస్తే పోలీసుల ద్వారా భయపెట్టిస్తున్నారని ఆరోపించారు. అంతేకాదు క్రషర్ నుంచి వచ్చే కంకర ధూళి, దుమ్ము పంటలపై చేరడంతో పైర్లు నాశనం అవుతున్నాయని, దిగుబడి రూపంలో తీవ్రంగా నష్టపోతున్నామని అంటున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టరు పి.రంజిత్‌బాషాను కలసి తమ గోడును విన్నవించారు. న్యాయం చేస్తానని కలెక్టరు హామీ ఇచ్చారు. అంతకుముందు తమ గ్రామానికి తలనొప్పిగా మారిన క్వారీ నుంచి రక్షణ కల్పించాలని కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు.

### పోలీసులతో భయపెడుతున్నారు



మా పల్లెకు అర కిలోమీటరు దూరంలో క్వారీ, క్రషర్ యూనిట్ ఏర్పాటు చేశారు. 30 టన్నులు వచ్చిపోయే టిప్పర్ల వేగానికి చెరువు గట్టు దెబ్బ తింటుంది. రోడ్లు గుంతల మయంగా మారి దెబ్బతిన్నాయి. చెరువును కబ్జా చేసి రోడ్డు వేశారు. రెండేళ్ల క్రితం గ్రామస్తులంతా ఏకమై నిలదీస్తే తారురోడ్డు వేయిస్తానని మాట ఇచ్చినా ఇంత వరకు పట్టించుకోలేదు. క్వారీ నుంచి మా గ్రామానికి రక్షణ కల్పించాలి. **- రత్నానాయక్, కొల్లంపల్లి తండా**

### భారీ శబ్దాలకు ఇళ్లు పగుళ్లు



క్వారీ వల్ల మేం అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని జీవనం సాగిస్తున్నాం. బోరు ఘాతాలు వేసి సాయంత్రం 4-5 గంటల సమయంలో బ్లాస్టింగ్ చేస్తున్నారు. భారీ శబ్దాలకు ఊరుఊరంతా వణిపోతోంది. ఇళ్లు పగుళ్లు ఇస్తున్నాయి. పంట పొలాలు క్రషింగ్ దుమ్ముతో నిండిపోయి నష్టపోతున్నాం. ఈ క్వారీ మాకొద్దు సారూ..! కలెక్టరు సారే న్యాయం చేయాలి. **- ఎం.దీపానాయక్, ఉప సర్పంచ్, కొల్లంపల్లి గ్రామం**

### చెరువును నింపాలి



మా ఊరు చెరువు కింద 85 ఎకరాల ఆయకట్టు ఉంది. హంద్రీనీవా కాలువ ద్వారా నీటిని నింపుతామని పైపులైన్ వేశారు. నీళ్లు వదలలేదు. తక్షణమే చెరువును నింపాలి. చెరువు గట్టుపై క్వారీ టిప్పర్లు రాకుండా నియంత్రించాలి. చెరువును అక్రమించి రోడ్డు వేసిన క్వారీ యజమానిపై చర్యలు తీసుకోవాలి. **- జె.సోమనాయక్, రైతు**

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

**ఆదోని రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి):** మండలం పెద్దతుంబళం గ్రామానికి చెందిన కురువ తిమ్మప్ప(25) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. వివరాల మేరకు.. ఆదివారం రాత్రి గ్రామంలోని మహబూబ్‌బాష ఇంట్లో సెంట్రింగ్ పనులు చేస్తుండగా, తిమ్మప్ప చేతిలోని ఇనుక కడ్డీ విద్యుత్ తీగ తగిలి కరెంటు ప్రసరించి విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్థానికులు ఆదోని ఏరియాసుపత్రికి తరలించారు. అయితే కోలుకోలేక మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కాగా మృతుడి భార్య మూడు సంవత్సరాల క్రితం ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

## ముగ్గురి అరెస్టు

- నకిలీ పాస్ పుస్తకాలు, నకిలీ టైటిల్ డీడ్‌లు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్

**కోవెలకుంట్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి):** నకిలీ పట్టాదారు పాస్ పుస్తకాల కుంభకోణం కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 12 నకిలీ పాస్‌బుక్‌లు, ఐదు నకిలీ టైటిల్‌డీడ్‌లు స్వాధీనం చేసుకున్నట్లు ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ తెలిపారు. కోవెలకుంట్లలోని సర్కిల్ కార్యాలయంలో సోమవారం సీఐ హనుమంతనాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడిం టచారు. 2023లో సంజామల తహసీల్దారు జీవీ మల్లికార్జున రావు ఫిర్యాదు మేరకు సంజామల పోలీసు స్టేషన్‌లో అప్పట్లో కేసు నమోదయింది. సంజామల తహసీల్దారు కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటరుగా పనిచేస్తున్న బషీర్ అహ్మద్, సంజామలకు చెందిన సాయబోయిన ఉపేంద్ర కలిసి పేరుసోముల, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, ముదిగేడు తదితర గ్రామాల్లో లేని భూములను ఉన్నట్లుగా చూపుతూ కొత్త సర్వేనంబర్లు సృష్టించి సుమారు 55 మందికి నకిలీ పాస్ పుస్తకాలు ఇచ్చి ఆన్‌లైన్‌లో కూడా ఎక్కించారు. ఒక్కొక్కరికి ఐదు ఎకరాల చొప్పున పాస్‌బుక్కులు ఇచ్చేందుకు ఒక్కొక్కరి నుంచి రూ.30 వేలు తీకున్నారు. వీరిలో 49 మంది వేర్వేరు బ్యాంకుల్లో సుమారు రూ.80 లక్షల వరకు రుణం తీసుకున్నారు. ఉపేంద్ర, బషీర్ అహ్మద్ వారికి తెలిసిన సంజామలకు చెందిన ఇబూరి ప్రసాద్, గడివేములకు చెందిన దూదేకుల మహ్మద్ రఫీ, దూదేకుల పెద్ద జమాల్‌బాషా, కర్నూలుకు చెందిన అబ్దుల్ సత్తార్, కంపమల్లకు చెందిన వరప్రసాద్ కలిసి అమాయకులను ఎంపిక చేసుకున్నారు. వారికి నిజం చెప్పకుండా లేని భూమిని ఉన్నట్లుగా చెప్పి నకిలీ పాస్‌బుక్కులు ఇవ్వడంతో పాటు 2018లో అప్పటి తహసీల్దార్ ఎలిజబెత్ ఆన్‌లైన్‌కు అప్రూవల్ చేశారు. 06 సర్వే నెంబరు సృష్టించి 321.83 ఎకరాలు లేని భూమి ఉన్నట్లుగా చూపించి 67 మందికి ఆన్‌లైన్ ఎక్కించి 55 మందికి పాస్‌బుక్కులు ఇచ్చారు. ఈ పాస్‌బుక్‌లు తీసుకున్న వారందరూ సంజామల, కోవెలకుంట్ల, గడివేముల, నందికొట్కూరు, కర్నూలు జిల్లాకు చెందిన వారిగా తెలిసింది. బ్యాంకుల్లో నకిలీ పాసు పుస్తకాలు పెట్టి రుణాలు తీసుకున్న వారు తిరిగి రుణాన్ని చెల్లించాలని, లేకపోతే వారిపై చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు. సంజామల గ్రామానికి చెందిన సాయబోయిన ఉపేంద్ర, ఇపూరి వరప్రసాద్, దూదేకుల మహ్మద్‌రఫీని విచారించినట్లు తెలిపారు. సంజామల ఎస్ఐ రమణయ్య ఉన్నారు.

## విచారణకు హాజరైన కాటసాని ఓబుల్‌రెడ్డి

**డోన్ టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి):** బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కుమారుడు కాటసాని ఓబుల్‌రెడ్డిని డోన్ డీఎస్పీ శ్రీనివాసు లు సోమవారం విచారించారు. పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో అడ్వకేట్ అబ్దుల్ ఖైర్ సమక్షంలో ఐదు గంటలకుపైగా ఈ విచారణ కొనసాగింది. డీఎస్పీ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతేడాది మే నెలలో జరిగిన బనగానపల్లె మార్కెట్ కాంట్రాక్టుకు సంబంధించిన విషయంపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, హత్యాయత్నం కేసుపై విచారించినట్లు తెలిపారు. ఆ కేసుకు సంబంధించి కాటసాని ఓబుల్‌రెడ్డి హాజరు కావాలని గతంలో నోటీసులు ఇచ్చింది. ముందస్తు బెయిల్‌తో పాటు అడ్వకేట్ సమక్షంలో విచారిం చాలని ఓబుల్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. ఆ మేరకు ఓబుల్‌రెడ్డికి ముందస్తు బెయిల్ ఇవ్వడంతో పాటు అడ్వకేట్ సమక్షంలో విచారణ చేయాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. డోన్ డీఎస్పీ సోమవారం అడ్వకేట్ సమక్షంలో విచారణ చేశారు. స్టేట్‌మెంట్ రికార్డు చేసి హైకోర్టుకు పంపించామని డీఎస్పీ చెప్పారు. డీఎస్పీ మాట్లాడుతూ గతంలో ఎస్సీ, ఎస్టీ కేసుతో పాటు ఇటీవల బనగానపల్లెలో ఓ సమావేశంలో అనుచిత వ్యాఖ్యలు చేయడంపై కేసు నమోదైందని, అలాగే ఓబుల్‌రెడ్డిపై కేసు నమోదైందని తెలిపారు. కాటసాని ఓబుల్‌రెడ్డితో పాటు అనుచరులు దుర్గా, టోపి అబ్బాస్‌తో పాటు మరికొంత మందిపై కేసులు నమోదైనట్లు తెలిపారు.



విచారణ అనంతరం బయటకు వస్తున్న కాటసాని ఓబుల్‌రెడ్డి

- అడ్వకేట్ సమక్షంలో 5గంటలకు పైగా విచారించిన డోన్ డీఎస్పీ

## వసతి గృహాల్లో సామర్థ్యం పెంచాలి

- సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి



మాట్లాడుతున్న మంత్రి డోలాశ్రీ బాలవీరాంజనేయస్వామి

**నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి):** వసతి గృహాల్లో సామర్థ్యం పెంచాలని అందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సాయంత్రం మంత్రి కలెక్టర్ రాజకుమారి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్యతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాకు వసతి గృహాల మరమ్మత్తులకు రూ.9.30 కోట్ల నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు. అయినప్పటికీ వసతిగృహాల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడంలో యంత్రాంగం విఫలమైందన్నారు. వెల్పనూరు, వెంకటాపురం, శ్రీశైలం, ఆత్మకూరు. నందికొట్కూరు వసతి గృహాల్లో తక్కువ అడ్మిషన్లు ఉన్నాయని, అసలు అధికారులు ఎందుకు అవగాహన పెంచేలా చర్యలు తీసుకోవడం లేదో అర్థం కావడం లేదన్నారు. ఇలా అయితే తక్కువ శాతం విద్యార్థులు ఉన్నచోట చర్యలు తీసుకోవడానికి ఏ మాత్రం వెనుకాడబోమన్నారు. ఉపాధ్యాయులు కూడా ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యార్థుల మార్కుల శాతం పెంచేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వసతి గృహాల్లో రక్తహీనత ఉన్న విద్యార్థినులకు సరైన పోషకాలు అందించాలన్నారు. జిల్లాలో వసతి గృహాల్లో చదువుకునే 10వ తరగతి విద్యార్థులు ఐదుమంది, జూనియర్ ఇంటర్ విద్యార్థులు 124 మంది, సెకండ్ ఇయర్ విద్యార్థులు 31 మంది ఫెయిల్ అయ్యారని, దీనిపై కారణాలు తెలుసుకుని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఎస్సీ కార్పోరేషన్ పరిధిలో 57 షాపింగ్స్, 46 ఫంక్షన్‌హాల్స్ ఉన్నాయని వాటిపై ప్రత్యేక దృష్టిసారించి వాటిని ఉపయోగించుకుని ఆదాయ వనరులు పెంచాలన్నారు. చెవిటి, మూగ బదిరుల పాఠశాలల్లోని బాత్రూంలలో కాలింగ్ బెల్స్ ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో నంద్యాల, కర్నూలు సాంఘిక సంక్షేమ అధికారులు చింతామణి, రాధిక తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ సిద్ధం

- నంద్యాల జిల్లా ఇన్‌చార్జి రమేష్ నాయుడు
- నూతన కార్యవర్గం ఎంపిక

**నంద్యాల కల్చరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి):** స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ సిద్ధంగా ఉందని ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జి పోతుగుంట రమేష్ నాయుడు, జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు అన్నారు. నంద్యాలలోని బీజేపీ కార్యాలయంలో జిల్లా కమిటీని ప్రకటించారు. వారు మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేయడానికి జిల్లా కమిటీని ప్రకటించామన్నారు. పార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్లుగా డోన్‌కు ఎస్వీ రమణ, నంద్యాల నిమ్మకాయల సుధాకర్, ఉపేంద్రనాథ్‌రెడ్డి, పసుపుల రవీంద్రకుమార్, బనగానపల్లె ఎస్కే చాందిని, శ్రీశైలం దుంపటి మురళీధర్ చౌదరి, జిల్లా జనరల్ సెక్రటరీలుగా డోన్ కిరణ్, నంద్యాల కశెట్టి చంద్రశేఖర్, బనగానపల్లె శివకృష్ణ యాదవ్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. జిల్లా సెక్రటరీలుగా డోన్ పత్తి నాగమోహన్, నంద్యాల ఇనుగూరి జయలక్ష్మి, కె. భరత్‌కుమార్, ఆళ్లగడ్డ మనుప్రియా రెడ్డి, నందికొట్కూరు శంకర్‌గౌడ్, నంద్యాల రోజమ్మ, జిల్లా ట్రెజరర్‌గా నంద్యాల పసుపుల శివసాయి, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్‌గా శ్రీశైలం చింతా నాగేశ్వర రావు, జిల్లా ఐటీ కన్వీనర్‌గా వీరేశ్‌కుమార్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు.



బీజేపీ జిల్లా అధ్యక్షుడిని సన్మానిస్తున్న సభ్యులు

## వ్యక్తికి తీవ్ర గాయాలు



క్షతగాత్రుడిని వాహనంలోకి చేర్చుతున్న సీఐ రాము, కానిస్టేబుల్

**ఆత్మకూరు రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని బాపనంపతాపురం గ్రామ శివార్లలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓవ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వడ్లరామాపురం గ్రామానికి చెందిన సురేష్, నాగరాజు, వెంకటేశ్వర్లులు ఓ బైక్‌పై వెలుగోడు రిజర్వాయర్‌ను సందర్శించి తిరుగు ప్రయాణంలో బాపనంతాపురం గ్రామ శివార్లలోకి చేరుకోగానే వారికి రోడ్డుపై బర్రెలు అడ్డు రావడంతో ఒక్కసారిగా బైక్ అదుపుతప్పి కింద పడిపోయారు. దీంతో నాగరాజుకు తీవ్ర గాయాలు కాగా, సురేష్, వెంకటేశ్వర్లుకు స్వల్ప గాయాలయ్యాయి. మంత్రి బందోబస్తు కోసం అటుగా వెళుతున్న సీఐ రాము, కానిస్టేబుల్ సాగర్ వారిని హుటాహుటిన ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## నంద్యాల కేంద్రంగా నకిలీ సర్టిఫికెట్లు!

- దేశ వ్యాప్తంగా సరఫరా
- బైక్‌ల రికవరీతో కదిలిన డొంక
- నలుగురు నిందితుల అరెస్టు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాబు ప్రసాద్

**కర్నూలు క్రైం, జూలై 21 (ఆంధ్రజ్యోతి):** బైకుల చోరీలో దర్యాప్తు చేసిన పోలీసులు నకిలీ సర్టిఫికెట్లు తయారు చేసే ముఠా గుట్టును రట్టు చేశారు. కర్నూలు త్రీటౌన్ పోలీసులు ఇటీవల ఈ నెల 14వ తేదీన ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 23 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఆ కేసులో లోతుగా దర్యాప్తు చేస్తే దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల ఆర్టీఏ బ్రోకర్లకు నకిలీ ఆర్సీలు తయారు చేయించి ఇస్తున్న ముఠా పట్టుబడింది. ఇందుకు సంబంధించిన వివరాలను సోమవారం సాయంత్రం కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్, త్రీటౌన్ సీఐ శేషయ్యలు వెల్లడించారు. నిందితులు షేక్ షాఫీర్‌బాషా (చాంద్‌బాడ, నంద్యాల), షేక్ సుభాన్ (బాల్‌కొండహాల్, నంద్యాల), సుధీర్‌బాబు (వీసీ కాలనీ, నంద్యాల), పెనుగొండ సూరప్ప (రెవెన్యూ కాలనీ, కర్నూలు)లను అరెస్టు చేశారు. నంద్యాల కేంద్రంగా నడిపిన నకిలీ సర్టిఫికెట్ల తయారీ ముఠాకు షేక్ షాఫీర్ బాషా నాయకుడు. షేక్ సుభాన్, సుదీర్‌బాబు, పెనుగొండ సూరప్పలు వారికి కావాల్సిన నకిలీ ఆర్సీలు, ఐటీఐ సర్టిఫికెట్లు తదితర వాటిని తయారు చేయించుకుంటారు. ఇప్పటి వరకు సుదీర్ బాబు అనే నిందితుడు 150 డూప్లికేట్ ఆర్సీలు, పోలీసు ఎన్‌వోసీలు షాఫీర్‌బాషా వద్ద తయారు చేయించుకున్నాడు. పెనుగొండ సూరప్ప అనే వ్యక్తి డోన్ ఐటీఐ కాలేజీలో పని చేస్తూ సుమారు 500 నకిలీ ఐటీఐ సర్టిఫికెట్లు తయారు చేయించుకున్నాడు. సుభాన్ అనే నిందితుడు 50 డూప్లికేట్ ఆర్‌సీలు తయారు చేయించుకున్నారు. దీంతో పాటు షాఫీర్‌బాషా, సుబాన్‌లు కలిసి ఫేస్‌బుక్‌లో 'పీవీసీ చిప్ కార్డులు దొరుకును' అంటూ వివిధ భాషల్లో ఓ ప్రకటనను ఇచ్చుకుని వ్యాపారాన్ని కొనసాగించారు.

ఈ ప్రకటనను చూసిన పలు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఢిల్లీ, మహారాష్ట్ర, పుదుచ్చేరి, కేరళ, ఒరిస్సా, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఆర్‌టీఏ బ్రోకర్లు వీరిని సంప్రదించారు. అక్కడి నుంచి వారు తమకు అవసరమైన డేటాను షాఫీర్, సుబాన్‌లకు పంపిస్తే వీరు తమ తెలివితేటలతో ఒరిజినల్‌కు ఏ మాత్రం తీసిపోకుండా నకిలీ ఆర్సీలు తయారు చేసి కొరియర్ ద్వారా పంపిస్తారు. ఇలా తమ దందా కొనసాగిస్తూ వచ్చారు.

బైకుల రికవరిలో ఆరా తీస్తే.. ఈ నిందితుల బాగోతం బయటకు వచ్చింది. నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 18 నకిలీ ఐటీఐ సర్టిఫికెట్లు, 2 నకిలీ పోలీసు ఎన్‌వోసీలు, ల్యాప్‌ట్యాప్, ప్రింటర్, ఒక సీల్, 29 నకిలీ ఆర్సీలు, ఒక ఇన్నోవా, ఒక హోండా కారు, 150 ఖాళీ పీవీసీ చిప్ కార్డులు, ఇతర రాష్ట్రాలకు చెందిన 220 డూప్లికేట్ ఆర్సీలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించిన సీఐలు శేషయ్య, నాగశేఖర్, ఎస్ఐలు చంద్ర, మల్లికార్జున, అంజనప్ప, రెహిమాన్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, కానిస్టేబుల్ శేఖర్, చంద్రబాబు నాయుడు కిరణ్ కుమార్, పరమేశ్వరుడు, వీరబాబులను డీఎస్పీ అభినందించారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ తెలిపారు.

## నంద్యాల ఎస్టీ డీఎస్పీగా శ్రీనివాసరెడ్డి



**నంద్యాల టౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి):** నంద్యాల ఎస్టీ డీఎస్పీగా శ్రీనివాసరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. తన పరిధిలో నేరాలను నియంత్రించిడంలో కృషి చేస్తామన్నారు. క్షణికావేశంలో నేరాలు చేయవద్దని సూచించారు. శాంతి భద్రతలు కాపాడేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం పలువురు సీఐలు, ఎస్ఐలు శుభాకాంక్షలు తెలిపారు.

## నేటి నుంచి పీఠాధిపతి 13వ చాతుర్మాస దీక్ష

- 49 రోజులు మంత్రాలయం సరిహద్దులు దాటకుండా పూజలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన శ్రీమఠం అధికారులు



**మంత్రాలయం, జూలై 21 (ఆంధ్రజ్యోతి):** రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు తన 13వ చాతుర్మాస దీక్షలు ఈ నెల 22 నుంచి సెప్టెంబరు 8 వరకు దాదాపు 49 రోజులు చాతుర్మాస దీక్ష స్వీకరించనున్నారు. మంగళవారం తెల్లవారుజాము నుంచి మధ్వపీఠం అనుసరించి శ్రీమఠం సంప్రదాయ పద్ధతిలో వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల మధ్య దండకం చేతపట్టి మూల రాములకు, రాఘవేంద్రస్వామి బంగారు పాదాలకు పూజలు చేయగా మహిళలు హారతులు ఇవ్వనున్నారు.

శ్రీమఠం పండితులు సుజీంద్రాచార్, ఆనందతీర్థాచార్, గౌతమాచార్, శ్రీనాథాచార్, వాధిరాజాచార్, మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, శ్రీపతాచార్, వెంకటేష్‌జోషీ, సురేష్ కోనాపూర్, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తు 13వ చాతుర్మాసదీక్షలు మంత్రాలయంలోనే కొనసాగించాలని ఆహ్వానిస్తారు. ఈదీక్షకు ఇప్పటికే ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. ఈ నెల 22 నుంచి సెప్టెంబరు 8 వరకు 49 రోజులు మంత్రాలయం సరిహద్దులు దాటకుండా మంత్రాలయంలోనే ఉంటూ భక్తులకు అందుబాటులో ఉండి పూజలు చేసి భక్తులను ఆశీర్వదిస్తారు. ఎంతో పవిత్రమైన చాతుర్మాస దీక్షలు స్వీకరణ చేసి సెప్టెంబరు 8న విరమణ సమయంలో భారీ ఊరేగింపు నిర్వహించి సంబరాలు నిర్వహిస్తారు.

## నంద్యాలలో అటల్ ఇంక్యూబేషన్ సెంటర్



ఒప్పంద పత్రాలు అందుకుంటున్న కళాశాల యాజమాన్యం

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నంద్యాల రామకృష్ణా డిగ్రీ కళాశాలలో అటల్ ఇంక్యూబేషన్ సెంటర్ ఏర్పాటుపై సంస్థ సీఈవోతో కళాశాల యాజమాన్యం ఒప్పందం కుదుర్చుకుంది. సంస్థ సీఈవో డాక్టర్ మౌళి మాట్లాడుతూ విద్యార్థులు సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారాలు కనుగొనాలని సూచించారు. ఇంక్యూబేషన్ అన్నది విద్యార్థుల సరికొత్త ఆవిష్కరణలకు ఆకారం ఇవ్వడంలో కీలకమైందన్నారు. కళాశాల ఛైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఇంక్యూబేషన్ ద్వారా ఉద్యోగాల కోసం వెతకకుండా, ఉద్యోగాలను సృష్టించే వ్యక్తులుగా విద్యార్థులను తీర్చిదిద్దవచ్చన్నారు. ఇన్నోవేటివ్ ఐడియాలను ప్రోత్సహించి వాటిని స్టార్టప్‌లు లేదా వాణిజ్య ప్రాజెక్టులుగా అభివృద్ధి చేయవచ్చన్నారు. ప్రతి విద్యార్థి ఇంక్యూబేషన్ సెంటర్‌ను ఉపయోగించుకుని పారిశ్రామికవేత్తగా మారి దేశ ఉన్నతికి సహాయపడాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల డైరక్టర్ హేమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలకు కనీస వేతనాలు పెంచాలి



నందికొట్కూరు సీడీపీవో మంగవల్లికి వినతిపత్రం సమర్పిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

నందికొట్కూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఎఫ్ఆర్ఎస్ యాప్‌లను రద్దు చేసి, అంగన్‌వాడీలకు కనీస వేతనాలు పెంచాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు మదర్‌బి, సీఐటీయూ జిల్లా నాయకులు గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం నందికొట్కూరు ఐసీడీఎస్ కార్యాలయం ముందు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ రోజురోజుకు పెరిగిపోతున్న ధరలకు అనుగుణంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ వేతనాలను సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రూ.26 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పద్మ, శైలజ, లక్ష్మీ, కుసుబ్బీ, ప్రసన్న, సుబ్బమ్మ, సరస్వతి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**ఆత్మకూరు:** అంగన్‌వాడీ వర్కర్లకు పేస్‌యాప్‌ను రద్దు చేయాలని, సెంటర్ నిర్వహణకు ఒక్క యాప్ మాత్రమే నిర్వహించాలని సీఐటీయు నాయకులు రామ్‌నాయక్, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ నాయకురాలు మంజుల పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి కార్యాలయ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకురాలు ప్రమీలమ్మ, లక్ష్మీదేవీ, శ్యామలమ్మ, రామతులసమ్మ, కుమారీ, నాగలక్ష్మీ, అనిత తదితరులు ఉన్నారు.

## 'స్మార్ట్ మీటర్లు వద్దు'




పటేల్ సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న నాయకులు

నందికొట్కూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆదాని స్మార్ట్ మీటర్లు వద్దని, ట్రూ ఆఫ్ చార్జీలు రద్దు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శి నరసింహులు డిమాండ్ చేశారు. సోమవారం నందికొట్కూరులో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో పటేల్ సెంటర్‌లో రాస్తారోకో చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి వివిధ వర్గాల ప్రజలకు 176 హామీలు ఇచ్చిందన్నారు. స్మార్ట్ మీటర్ల పేరుతో దోపిడీని తెరపైకి తీసుకువచ్చి ప్రజలపై వేల కోట్ల రూపాయల భారాన్ని వేస్తోందన్నారు. ఆదానికి లాభాలు చేకూర్చే స్మార్ట్ మీటర్లను, చార్జీలను రద్దు చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి అరుణ్‌కుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు మజీద్ మియా, అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ పాల్గొన్నారు.

## సైకిల్ స్టాండ్ ఏర్పాటు చేయాలి

నందికొట్కూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డిపో ముందు సైకిల్ స్టాండ్ ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం నందికొట్కూరు ఆర్టీసీ డిపో ముందు సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాండ్ వద్ద సైకిల్ స్టాండ్, పార్కింగ్ సదుపాయాన్ని కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. డిపోలో వాహనాల పార్కింగ్ లేకపోవడంతో ప్రయాణికులు వాహనం పార్కింగ్ చేయాలంటే భయపడుతున్నారన్నారు. ఆర్టీసీ డిపో వద్ద పార్కింగ్ స్థలాన్ని కేటాయించాలని ఆర్టీసీ డిపో మేనేజర్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎస్‌బీబీ, లక్ష్మీదేవి, ముత్తుజాబి, సోమన్న, షేక్షావలి పాల్గొన్నారు.





రైతు సేవా కేంద్రంలో వెలుగుతున్న దీపాలు

## విద్యుత్ వృథా

వెలుగోడు, జూలై 21(ఆంధ్రజ్యోతి): వెలుగోడు పట్టణంలోని రైతు సేవా కేంద్రం 3లో పగలు, రాత్రి విద్యుత్ దీపాలు వెలుగుతునే ఉంటాయి. కార్యాలయాలకు తాళం వేసిన తర్వాత విద్యుత్ ఆఫ్ చేసి వెళ్తారు. ఇక్కడ మాత్రం సిబ్బంది అలా చేయడం లేదు. విద్యుత్‌ను ఆదా చేయాలని విద్యుత్ అధికారులు చెబుతున్నా సిబ్బంది పాటించడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. సచివాలయాలకు, రైతు భరోసా కేంద్రాలకు కొన్ని సంవత్సరాల నుంచి విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడంతో విద్యుత్ బకాయిలు లక్షల్లో పేరుకుపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్‌ను ఆదా చేయాలని పలువురు కోరుతున్నారు.

## కురిసింది వాన..
# మురిసింది నేల

- ఉధృతంగా ప్రవహించిన వాగులు, వంకలు
- పంటపొలాల్లోనూ నిలిచిన వర్షపునీరు



పెద్దదేవళాపురం వద్ద నీటమునిగిన పంట పొలాలు



నల్లమలలో కురిసిన వర్షంతో రాళ్లవాగు మీదుగా సిద్ధాపురం చెరువులోకి చేరుతున్న వర్షపునీరు

బండిఆత్మకూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): గత నెల రోజుల నుంచి చినుకు లేదు.. దీంతో అరకొర కురిసిన వర్షాలకు సాగు చేసిన పంటలు కూడా ఎండుముఖం పట్టాయి. దీంతో రోజు వరుణుడు కోసం రైతులు నిత్యం పూజలు చేస్తున్నా కరుణించలేదు. బండి ఆత్మకూరు మండలంలో ఆదివారం రాత్రి 11 గంటల నుంచి సోమవారం ఉదయం 7గంటల వరకు ఎడతెరపిలేకుండా వర్షం కురిసింది. దీంతో మండలంలోని రాళ్లవాగు, మద్దిలేరు వాగు, సంకట వాగు, జళ్ళవాగు. రాధావంక, వెరసి కుందూనది ఉధృతంగా ప్రవహించింది. ప లు గ్రామాల్లో పొలాలన్నీ నీటమునిగాయి. దీంతో రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**వెలుగోడు:** మండలంలో ఆదివారం అర్ధరాత్రి నుంచి భారీ వర్షం కురిసింది. ఈ వర్షం 69.6 మి.మీగా నమోదైంది. భారీగావర్షం పడటంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వెలుగోడు నుంచి జమ్మినగర్ తాండ, గట్టుతాండ, రుద్రకోడూరు ప్రాంతాల వెళ్లే రహదారిలోని ఊట కాల్వ పొంగిపొర్లడంతో ఆ ప్రాంతాలకు వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

**ఆత్మకూరు:** ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత భారీ వర్షం కురిసింది. దీంతో సంతోషం వ్యక్తం చేశారు. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. దీంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.



సంతజూటూరు పికప్ ఆనకట్ట వద్ద నీటి ప్రవాహం



వెలుగోడులో పొంగిపొర్లుతున్న ఊట కాల్వ

# జగన్ ఐదేళ్ల పాలనలో వ్యవస్థలు అస్తవ్యస్తం

- సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి
- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి



మాట్లాడుతున్న మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి

కొత్తపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు అస్తవ్యస్తమయ్యాయని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కొత్తపల్లి మండలంలోని దుద్యాల గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, నంద్యాల పార్లమెంటు టీడీపీ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డిలతో కలిసి మంత్రి ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు అన్ని వ్యవస్థలను గాడిలో పెడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తున్నారని అన్నారు.ప్రభుత్వం వచ్చిన ఏడాది కాలంలోనే రూ.3వేల పింఛన్‌ను రూ.4వేలు, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఇంట్లో ఎంత మంది విద్యార్థులు చదువుకుంటుంటే అందరికీ తల్లికి వందనం ఇచ్చిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదే అన్నారు. ఈ నెలలోనే కేంద్ర నిధులతో కలిపి అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుల ఖాతాలో రూ.7వేలు నగదు జమ చేస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. జగన్ హయాంలో రూ.10లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తే.. నేడు వడ్డీలు కడుతూ సీఎం చంద్రబాబు సంక్షేమం ఒక్క పక్క, అభివృద్ధి మరో పక్క సమానంగా చేసుకుంటూ రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారన్నారు. లిక్కర్ స్కాంలో రూ.3,500 కోట్లు దోచుకున్నారని, నేడు ఒక్కొక్కరు జైలుకు వెళ్తున్నారన్నారు. ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఎత్తిపోతల పథకాలు టీడీపీ హయాంలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నంద్యాల పార్లమెంటు టీడీపీ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి మాట్లాడుతూ టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో నందికొట్కూరు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రసాద్ రెడ్డి, రాష్ట్ర యాదవ సంఘం డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, ఆర్డీవో నాగజ్యోతి, మండల ప్రత్యేక అధికారి చింతామణి, ఎస్సీ కార్పొరేషన్ డీడీ రాధిక, డీఎస్పీ రామాంజి నాయక్, ఎంపీడీవో మేరీ, తహసీల్దార్ ఉమారాణి, నాయకులు సురేంద్రనాథ్ రెడ్డి, నారపురెడ్డి, లింగస్వామి గౌడు, మల్లారెడ్డి, జీఎండీ రఫీ, మన్సూర్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమానికి పెద్దపీట: మంత్రి



ప్రమాణ స్వీకారం చేస్తున్న సొసైటీ చైర్మన్, డైరెక్టర్లు

కొత్తపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నాడు మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రైతులను విస్మరిస్తే నేడు కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేసిందని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి అన్నారు. సోమవారం కొత్తపల్లిలోని వెన్నెల గార్డెన్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన నాగంపల్లి సొసైటీ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార మహోత్సవానికి మంత్రితో పాటు ఎమ్మెల్యే నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, నంద్యాల పార్లమెంటు టీడీపీ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ సొసైటీల ద్వారా రైతులకు అన్ని రకాల ఎరువులను అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. అలాగే మండలానికి చెందిన పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కులను అందజేశారు. అనంతరం నాగంపల్లి సొసైటీ చైర్మన్‌గా నాగేశ్వరరావు యాదవ్, డైరెక్టర్లుగా రాధాకృష్ణారెడ్డి, హుశేనయ్యలతో సొసైటీ మేనేజర్ మహ్మద్ రసూల్, ఇన్‌చార్జి సీఈవో సాయి కుమార్‌లు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో నందికొట్కూరు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర యాదవ సంఘం డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, నాయకులు నారపురెడ్డి, లింగస్వామి గౌడు, అమర్నాథ్ యాదవ్, చంద్రశేఖర్ రెడ్డి, సురేంద్రనాథ్ రెడ్డి, నడిపన్న, నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీల సమస్యలు పరిష్కరించాలి



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

పాణ్యం, జూలై 21(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఎస్సీల సమస్యలు పరిష్కరించాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు దేవదానం రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి బాలాంజనేయులును కోరారు. సోమవారం మంత్రిని కలిసి వినతిపత్రం అందజేసినట్లు దానం తెలిపారు. పాణ్యం మండలంలో అంబేద్కర్ భవనంకు 25 సెంట్ల స్థలం కేటాయించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని కోరారు. జిల్లాలోని ఎస్సీ ఎస్టీ శ్మశానవాటికలకు ప్రహరీ, తాగునీటి బోరు, దహదారుల అభివృద్ధి చేయాలని కోరారు.

## వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

ఆత్మకూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని సీపీఎం నాయకులు రణధీర్, రామ్‌నాయక్, సురేంద్ర, వీరన్నలు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో పారిశుధ్యం లోపించడం వల్ల ప్రజలు సీజనల్ వ్యాధులకు గురై ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. తాగునీటి సరఫరా విషయంలో మున్సిపల్ అధికారులు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. దోమల బెడద వల్ల వ్యాధులు విజృంభిస్తున్నాయని, నివారణకు చర్యలు చేపట్టాలని అన్నారు.

## సిద్ధాపురం జలాలకు ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న నాయకులు

ఆత్మకూరు, జూలై 21(ఆంధ్ర జ్యోతి): మండలంలోని సిద్ధాపురం చెరువు జలాలకు సోమవారం టీడీపీ మండలాధ్యక్షులు రవీంద్రబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆదివారం అర్ధరాత్రి నల్లమలలో కురిసిన భారీ వర్షానికి రాళ్లవాగు ఉప్పొంగి సిద్ధాపురం చెరువులోకి వరదజలాలు వచ్చిచేరాయి. దీంతో చిన్నతూము వద్ద చెరువు జలాలకు పూజలు నిర్వహించారు. సిద్ధాపురం చెరువు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఎంతోగానో కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు రఘుస్వామిరెడ్డి, సేనారెడ్డి, మహేశ్వరరెడ్డి, కిరణ్ షిండే ఉన్నారు.

## సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆత్మకూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణంలో 30, 31 తేదీల్లో జరిగే సీపీఐ జిల్లా 2వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ తాలుకా కార్యదర్శి టీ.ప్రతాప్, పట్టణ కార్యదర్శి అహ్మద్‌హుసేన్, ఏఐటీయూసీ నాయకులు లల్లు పేర్కొన్నారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు షబ్బీర్, చాంద్, మాబాషా, అలిషేర్, సురేష్ ఉన్నారు.

## ఆటో నగర్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలి

నంద్యాల రూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణ శివారులోని ఆటో నగర్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలని సీపీఐ యపట్టణ కార్యదర్శి ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ, ఏఐటీయూసీ, రైతు సంఘం నాయకులు ఆటోనగర్‌లో పర్యటించి పలు సమస్యలును గుర్తించారు. వారు మాట్లాడుతూ కాలనీ ఏర్పాటైనప్పటి నుంచి సీసీ రోడ్డుకు నోచుకోవడం లేదన్నారు. ఎన్నికలప్పుడే మాత్రమే నాయకులు హామీలు ఇస్తున్నారే తప్ప కాలనీ సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు సోమన్న, తదితరులు పాల్గొన్నారు.

## చెంచు కుటుంబానికి ముస్లింల ఆర్థిక సాయం

పాణ్యం, జూలై 21(ఆంధ్రజ్యోతి) : స్థానిక ఇందిరానగర్‌లో ఈనెల 20వతేదీన అనారోగ్యంతో మృతి చెందిన మేకల నాగశేషులు కుటుంబానికి పాణ్యం ముస్లిం యువకులు ఆర్థిక సాయం అందించారు. నాగశేషుని భార్య కొండమ్మకు రూ. 10 వేలు, వంట సరుకులు అందజేశారు.

## కేసులకు భయపడం : మాజీ ఎమ్మెల్యే శిల్పా



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

మహానంది,జూలై 21 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో వైసీపీ నాయకులపై పెట్టే అక్రమ కేసులకు బయపడే ప్రసక్తే లేదని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం గాజులపల్లిలో బాబుష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రామ పధాన కూడలీలో ఏర్పాటు చేసిన వేదికపై ప్రజలనుద్ధేశించి మాట్లాడారు. కూటమి నేతలకు వచ్చే ఎన్నికల్లో ఘోరం ఓడించి ఇంటికి సాగనంపాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, నియోజిక వర్గం వైసీపీ సమన్వయకర్త శిల్పా భువనేశ్వరరెడ్డి, మండల కన్వీనర్ పాల మహేశ్వరరెడ్డి, వైసీపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, గోపవరం పుల్లయ్యాయాదవ్, కందుల రఘురామిరెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## పంచమఠాల్లో ప్రత్యేక పూజలు

- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



నంద్యాల కల్చరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): శ్రీశైలక్షేత్రంలో సోమవారం లోక కల్యాణార్థం ఆలయ ప్రాంగణంలో స్వామి అమ్మవార్లకు విశేషపూజలు ఆలయ వేదపండితులచే నిర్వహించారు. సోమవారం సందర్భంగా శ్రీశైల క్షేత్రంలో పంచమఠాలైన ఘంటామఠం, భీమశంకర మఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధరమఠం లోక కల్యాణం కోసం అర్చకులు పూజాదికాలు జరిపించారు. సాయంకాలం నిత్య కళారాధనలో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాదుకు చెందిన అక్షయ నృత్యాలయ బృందంచే సాంప్రదాయ నృత్యప్రదర్శన ఏర్పాటు చేశారు. నృత్యప్రదర్శనలో భాగంగా వినాయకకౌత్వం, శివాష్టకం, మార్కండేయస్తోత్రం, అయుగిరి నందిని, తదితర గీతాలకు, స్తోత్రాలకు తేజస్విని, నిత్య, స్నిగ్ధ, క్షేత్ర, వైష్ణవి, శ్రీకీర్తి తదితరులు నృత్య ప్రదర్శన గావించారు. ప్రాచీన కళల పరిరక్షణలో భాగంగా నిత్యకళారాధన కార్యక్రమంలో హరికథ,బుర్రకథ, సంప్రదాయనృత్యం, వాయుద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు నిర్వహించారు.

## పొలాలకు రహదారిని ఏర్పాటు చేయండి

మిడుతూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పైపాలెం గ్రామంలో ఏర్పాటు చేస్తున్న సోలార్ పనుల్లో రైతుల పొలాలకు వెళ్లేందుకు 40 అడుగు రహదారిని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ శ్రీనివాసులకు గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. రైతులు మాట్లాడుతూ సోలార్ పనుల్లో భాగంగా తమ పొలాలకు వెళ్లేందుకు సోలార్ నిర్వాహకులు 10 అడుగుల రహదారి మాత్రమే ఏర్పాటు చేయడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. పొలాల గెట్లను ఆనుకుని ఫెన్సింగ్ వేయడం వల్ల ఎద్దుల బండ్లు, వాహనాలు తిరిగేందుకు నానా అవస్థలు పడుతున్నామని అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచు రామచంద్రుడు, జగన్మోహన్ రెడ్డి, రామలింగేశ్వర రెడ్డి, వెంకటయ్య, నాగేశ్వర రావు, ఇనాయతుల్లా, శివమూర్తి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## అన్నదాతకు ప్రభుత్వం అండ: మాండ్ర



మాట్లాడుతున్న శివానంద రెడ్డి

మిడుతూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): అన్నదాతకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానంద రెడ్డి అన్నారు. సోమవారం మిడు తూరు గ్రామంలోని పీరుసాహేబ్ పేట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పాలక వర్గ చైర్మన్‌గా రెడ్డివారి వెంకటేశ్వర రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు, సభ్యులుగా ధనుంజయ రెడ్డి, ఉబేదుల్లా ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో మాండ్ర సురేంద్రనాథ రెడ్డి, పార్టీ పరిశీలకుడు దేవర్ల మురళీ, మార్కెట్ యార్డు చైర్మన్ ప్రసాద రెడ్డి, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ సుధాకర్, కాతా రామచంద్రా రెడ్డి, శివరామిరెడ్డి, నాగేశ్వరరెడ్డి, సర్వోత్తమ రెడ్డి, రామ స్వామి రెడ్డి, రవీంద్రబాబు, మనోహర్ రెడ్డి, వివిధ మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పార్టీకి అండగా ఉన్నవారికే పదవులు

నందికొట్కూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్న వారికే పదవులు దక్కుతాయని టీడీపీ నాయకులు మాండ్ర శివానందరెడ్డి, గౌరు వెంకటరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో నందికొట్కూరు పట్టణ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పాలకవర్గ చైర్మన్‌గా ముర్తుజావళి ప్రమాణస్వీకారం చేశారు. నందికొట్కూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా ఎన్నికైన ముర్తుజావళి, సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

## అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

గడివేముల, జూలై 21(ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ పథకంలో పేరులేని రైతులు ఈ నెల 23వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ వెంకట రమణ, మండల వ్యవసాయాధికారి పవన్ కుమార్ రైతులకు సూచించారు. సోమవారం వారు మాట్లాడుతూ ఆధార్ నెంబర్ తప్పుగా నమోదై, జాయింట్ ఎల్‌పీ సమస్య ఉన్న రైతులు రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రెవెన్యూ సమస్యలున్నవారు వీఆర్వోలకు అర్జీలు ఇచ్చి వాటిని పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎరువుల కోసం రైతుల ఆందోళన

నందికొట్కూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద ఎరువుల కోసం రైతులు ఆందోళన చేపట్టారు. సోమవారం నందికొట్కూరు మార్కెట్ యార్డులోని రైతు సేవా కేంద్రం వద్దకు యూరియా కోసం రైతులు వచ్చారు. యూరియా లేదని సంబంధిత అధికారులు చెప్పడంతో మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న కేజీ రోడ్డుపై ఆందోళన చేపట్టారు.

**పగిడ్యాల:** రైతులకు ఎరువుల పగిడ్యాల సొసైటీలో అందుబాటులో ఉన్నాయని , రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అవసరమైన ఎరువులను తీసుకెళ్లవచ్చునని సొసైటీ చెర్మన్ దామోదర్‌రెడ్డి తెలిపారు. పగిడ్యాల వ్యవసాయ పరపతి సహకార సొసైటీలో సోమవారం ఆయన మాట్లాడుతూ సొసైటీలో డీఏపీ 12 టన్నులు, 28.28 రకం ఎరువు 8టన్నులు అందుబాటులో ఉందన్నారు. త్వరలోనే యూరియా సొసైటీకి వస్తుందని, వచ్చిన వెంటనే రైతులకు సమాచారం ఇస్తామన్నారు. రైతులు పట్టాదారు బుక్, ఆదార్ జిరాక్స్‌లను తీసుకొని సొసైటీ సిబ్బందిని సంప్రదించాలని కోరారు. సమావేశంలో సొసైటి డైరెక్టర్లు పల్లె గంగన్న, శంకర్, సీఈవో ఖాజా, సిబ్బంది ఉన్నారు.

## చిరంజీవి పుట్టినరోజు వేడుకల పోస్టర్ విడుదల



పోస్టరును విడుదల చేస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల రూరల్ జూలై 21(ఆంధ్రజ్యోతి): నంద్యాల టీడీపీ కార్యాలయంలో సోమవారం మంత్రి ఎన్ఎండీ ఫరూక్ చేతుల మీదుగా పబ్బతీ రవి ఆధ్వర్యంలో చిరంజీవి పుట్టిన రోజు వేడుకల పోస్టరును విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు సాయిజయంత్, వెంకటేశ్, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

## 'కేసులపై ఉన్న శ్రద్ధ పాలనపై లేదు'



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి

నంద్యాల రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుకు వైసీపీ నేతల కేసులపై ఉన్న శ్రద్ధ పాలనపై చూపడం లేదని నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి విమర్శించారు. సోమవారం మండల పరిధిలోని అయ్యలూరులో బాబుష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేసులకు వైసీపీ నేతలు భయపడరన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలని వైసీపీ నేతలను కోరారు.

# ఒట్టిపోయిన చెరువులు

- రెండేళ్లుగా కరుణించని వరుణుడు
- అడుగంటిన భూగర్భ జలాలు
- పల్లెల్లో సాగు,తాగునీటి కష్టాలు

విభిన్న భౌగోళిక పరిస్థితులు కలిగిన మండలంలో కరువు పరిస్థితులు నెలకొంటున్నాయి. రెండేళ్లుగా వరుణుడి కరుణ లేకపోవడంతో భారీ వర్షాల జాడ కానరావడం లేదు. దీంతో మండలంలోని ప్రధానంగా ఐదు చెరువులూ ఒట్టిపోతున్నాయి. దీంతో భూగర్భ జలాలు అడుగంటి, సాగు, తాగు నీటి కష్టాలు తీవ్ర మవుతున్నాయి. పక్కనే అవుకు రిజర్వాయర్ ఉన్నా మండలానికి మాత్రం నీటి కష్టాలు తప్పడం లేదు.



అడుగంటి పోయిన తిమ్మనాయినిపేట చెరువు



ఎండిపోయిన కొలిమిగుండ్ల సద్దల వెంగన్న చెరువు



ఉప్పలూరులో ట్యాంకర్ వద్ద నీరు పట్టుకుంటున్న గ్రామస్థులు

కొలిమిగుండ్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మండల వ్యాప్తంగా 32గ్రామాలు ఉండగా, సుమారు పదిగ్రామాల ప్రజలు పూర్తిగా నాపరాయి మైనింగ్‌పై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. మిగిలిన గ్రామాల ప్రజలకు వ్యవసాయమే జీవనాధారం. ఇటీవల వర్షాభావ పరిస్థితులు తలెత్తాయి. ప్రస్తుత వర్షాకాలంలోనూ చాలా గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయాల్సిన దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి.

**పక్కనే నీరు ఉన్నా..**

మండలానికి పక్కనే అవుకు రిజర్వాయర్ ఉన్నది. ఆ రిజర్వాయర్ నీటిని జీఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా కొలిమిగుండ్ల మండలం మీదుగా కడప, చిత్తూరు జిల్లాలకు తరలిస్తున్నారు. కానీ, మండలంలోని చెరువులు నింపే అవకాశం లేదు. అలాగే గాలేరు-నగరి సుజల స్రవంతి కాలువ నీరు కొలిమిగుండ్ల మండల ప్రజలు చూడటానికి తప్ప, వాడుకోవడానికి అవకాశం లేదు. అవుకు రిజర్వాయర్ నుంచి సాగు, తాగునీటి కష్టాలు తీర్చే అవకాశం ఉన్నా పాలకుల చిత్తశుద్ధి లోపంతో ఆ కల నెరవేరడం లేదు.

**మండలంలో 30వేల ఎకరాల సాగు భూమి**

మండలంలో మైనింగ్‌తో పాటు, సిమెంటు పరిశ్రమలకు వేలాది ఎకరాల భూములు కేటాయించినప్పటికీ, మండలంలోని తిమ్మనాయినిపేట, నాగిశెట్టిపల్లె, ఎర్రగుడి, పెద్దవెంతుర్ల, కమ్మవారిపల్లె, అబ్దులాపురం, మదనంతపురం, కోరుమానుపల్లె, పేట్నీకోట తదితర గ్రామాల పరిధిలో 30వేల ఎకరాల భూమి సాగవుతోంది. ఆ గ్రామాల్లో వర్షాధార పంటలే దిక్కు. వర్షాలు కురవకపోతే ఆయా గ్రామాల పరిధిలో బోర్లు ఎండిపోయి పంటలు పండే పరిస్థితుల్లేవు.



వర్షం లేక ఎండిపోతున్న మొక్క జొన్న పంట

**గత టీడీపీ హయాంలో ఎత్తిపోతల పథకానికి అనుమతి**

- 2014లో టీడీపీ అధికారం చేపట్టిన తరువాత అప్పటి ఎమ్మెల్యేగా ఉన్న, ప్రస్తుత మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కొలిమిగుండ్ల మండల కష్టా లు తీర్చడానికి ప్రయత్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దగ్గర పట్టుబట్టి 2018లో తిమ్మ నాయినిపేట చెరువుకు ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేయించారు. జీఎన్ఎస్ఎస్ కాలువ నుంచి మండలంలో చెరువులు నింపడానికి అనుమతులు తీసుకవచ్చారు. అయితే, అంతలోనే ప్రభుత్వం మారి 2019లో వైసీపీ అధికారం చేపట్టడంతో దాన్ని మరుగున పడేశారు.

**కూటమి ప్రభుత్వంపై ఆశలు**

ప్రస్తుతం తిరిగి టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మండల ప్రజల ఆశలు మళ్లీ చిగురించాయి. అప్పటి ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి, ప్రస్తుతం మంత్రి కావడంతో కొలిమిగుండ్ల తాగు, సాగు నీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం దొరుకుందన్న ఆశాభావాన్ని మండల ప్రజలు వ్యక్తపరుస్తున్నారు.

**చెరువులను నింపాలి**



మండలంలో కరువు ఛాయలు కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం కరుణించాలి. అవుకు రిజర్వాయర్ నుంచి మండలంలో చెరువులు నింపి, ప్రజల కష్టాలు గట్టెక్కించాలి.

- దావీదు, సీపీఎం మండల నాయకుడు

## ముగిసిన మొహర్రం

- జనసంద్రంగా మారిన ప్యాపిలి



ప్యాపిలి పీర్ల సవారీలో భారీగా పాల్గొన్న భక్తులు

ప్యాపిలి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మొహర్రం సోమవారం ముగిసింది. పీర్ల సవారీ కన్నుల పండువగా సాగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో ప్యాపిలి జనంతో కిక్కిరిసిపోయింది. అలాగే దస్తగిరి స్వామి అగ్ని గుండంలోకి పీర్లు దిగారు. బందేనవాజ్, దస్తగిరి స్వామి పీర్లను అనేక హిందు కుటుంబాలు ఇంటి ఇలవేల్పుగా కొలుస్తారు. ఈ కుటుంబాలకు చెందిన అనేక మంది హైదరాబాద్, బెంగుళూరు, కర్నూలు, అనంతపురం తదితర ప్రాంతాల నుంచి తరలివచ్చారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్ఐ మధుసూదన్ పర్యవేక్షించారు.

## దేవాలయ భూములకు కౌలు వేలం



వేలంలో పాల్గొన్న రైతులు

రుద్రవరం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శ్రీరంగాపురం గ్రామంలో సోమవారం ఈశ్వరమ్మ, ఆంజనేయ స్వామి, ఈశ్వర, శ్రీరామ దేవాలయాలకు సంబంధించి భూములను 2025-26 సంవత్సరానికి గాను కౌలు వేలం నిర్వహించారు. రైతులు పోటాపోటీగా వేలం పాడడంతో రూ3.42లక్షలు ఆదాయం వచ్చినట్లు దేవదాయశాఖ ఈవో రామాంజనేయశర్మ తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ గోపి, గ్రామపెద్దలు నంద్యాల నారాయణరెడ్డి, నరసింహారెడ్డి, రమణ, పలువురు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు : ఎస్ఐ

శిరివెళ్ల, జూలై 21(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దని ఎస్ఐ చిన్నపీరయ్య సూచించారు. శిరివెళ్లలోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సైబర్ నేరాలు, రహదారి ప్రమాదాలు, పోక్సో యాక్ట్ తదితర వాటి గురించి ఎస్ఐ అవగాహన కల్పించారు. సమావేశంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేయాలి

శిరివెళ్ల, జూలై 21(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేయాలని శిరివెళ్ల మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు కొండబోయిన బాలచంద్రుడు కోరారు. సోమవారం మత్స్యశాఖ నంద్యాల జిల్లా జాయింట్ డైరెక్టర్‌గా హీరానాయక్ బాధ్యతలు చేపట్టడంతో పలువురు మత్స్యకారులు సన్మానించారు.

## మంత్రిని కలిసిన టీడీపీ నాయకుడు

శిరివెళ్ల, జూలై 21(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ఎస్సీ, గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని టీడీపీ నంద్యాల పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు మెట్ల భాస్కర్ కోరారు. నంద్యాల జిల్లాకు వచ్చిన సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామిని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మంత్రిని శాలువా, పూల మాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కొమ్మలపాటి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు వైద్యుల గైర్హాజరు



ఖాళీగా ఉన్న డాక్టర్ కుర్చీ

ఉయ్యాలవాడ, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఇద్దరు వైద్యులు విధులకు గైర్హాజరయ్యారు. డాక్టర్లు విధులకు రాకపోవటంతో కొంత మంది రోగులు వెనుదిరిగి వెళ్లిపోయారు. కొందరికి నర్సులే వైద్యం చేసి పంపించారు. ఈ విషయమై డీఎంహెచ్‌వో వెంకటరమణను వివరణ కోరగా తనకు ఎలాంటి సమాచారం లేదని, విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

## టీడీపీతోనే ప్రజాపాలన

- ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి
- 26వ వార్డులో 'సుపరిపాలనలో తొలి అడుగు'



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కోట్ల, నాయకులు

డోన్ టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే ప్రజాపాలన సాధ్యమని, సీఎం చంద్రబాబు నాయుడు సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావిస్తున్నారని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని 26వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యేతో పాటు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధిని, సంక్షేమాన్ని ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్రికే ఫణిరాజ్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి విజయభట్, ఓబులాపురం శేషిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషన్, పీఏసీఎస్ చైర్మన్ చిన్నపూజర్ల ఎల్లాగౌడు, చిట్యాల మద్దయ్యగౌడు, టీఈ రాఘవేంద్రగౌడు, ఆంజనేయులు గౌడు, వెంకటస్వామి, లారీల భాషా, టైలర్ ఖాజా, గుండాల జయరాముడు, ధర్మవరం ఈశ్వరయ్య, ధను, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు, మున్సిపల్ డీఈ రఘు, ఏఈ సురేష్ ట్రాన్స్‌కో ఏఈ నాగేశ్వరరెడ్డి, బుక్‌స్టాల్ మల్లి, కొచ్చెర్వు రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## కాశీ విశ్వేశ్వరుడికి విశేష పూజలు



కాశీ విశ్వేశ్వరస్వామి

కొలిమిగుండ్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పేట్నీకోట గ్రామంలో వెలసిన పురాతన కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఆషాడమాసం సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు గిరిస్వామి ఆధ్వర్యంలో విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించి, ప్రసాద వితరణ చేశారు భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు.

## 26న మండల సర్వసభ్య సమావేశం

కొలిమిగుండ్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 26న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రసాదరెడ్డి సోమవారం వెల్లడించారు. ఎంపీపీ నాగవేణి అధ్యక్షతన నిర్వహిస్తున్న సమావేశానికి వివిధ గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తప్పక హాజరు కావాలని కోరారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు వారి శాఖల ప్రగతి నివేదికలతో సభకు హాజరు కావాలని ఎంపీడీవో సూచించారు.

## విద్యార్థులు 80 మంది..ఉపాధ్యాయులు ఇద్దరే



శ్రీరంగాపురంలో విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

రుద్రవరం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శ్రీరంగాపురం ప్రాథమిక పాఠశాలలో 80 మంది విద్యార్థులు 1 నుంచి 5వ తరగతి వరకు విద్యను అభ్యసిస్తున్నారు. ఉపాధ్యాయులు మాత్రం ఇద్దరే ఉన్నారు. ఇక్కడ ఐదుగురు ఉపాధ్యాయులు బోధన చేయాల్సి ఉన్నది. బదిలీపై ఉపాధ్యాయులు రాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు, మూడు తరగతులను కలిపి బోధించాల్సి వస్తుందని ఉపాధ్యాయులు తెలిపారు. ఇద్దరు ఉపాధ్యాయులలో ఒకరు సెలవుపై వెళ్తే ఒకరే అన్ని తరగతులు చూడాల్సి వస్తుంది. సంబంధిత అధికారులు దృష్టించి ఉపాధ్యాయులను పంపాలని తల్లిదండ్రులు కోరుతున్నారు

## సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

బనగానపల్లె, జూలై 21( ఆంధ్రజ్యోతి): డోన్‌లో ఈనెల 30, 31 తేదీల్లో సీపీఐ జిల్లా 2వ మహాసభలు నిర్వహిస్తున్నామని, విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి శివయ్య తెలిపారు. సోమవారం మహాసభల కరపత్రాలు విడుదల చేశారు. బనగానపల్లె ప్రాంతంలోని కార్మికులు, ఉద్యోగులు, వ్యాపారులు, మేధావులు మహాసభల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సభ్యులు సుబ్బారెడ్డి, మద్దిలేటి, సుబ్రమణ్యం, ఎర్రిస్వామి, రవి, నాగాంజనేయులు, నాగార్జున , రాముడు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

ప్యాపిలి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలచట్ల గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన టీడీపీ నాయకులు రామాంజినేయులు మృతదేహాన్ని సోమవారం టీడీపీ నాయకులు వై లక్ష్మీనారాయణ యాదవ్ సందర్శించి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. నాయకులు రామ్మోహన్ యాదవ్, గండికోట రామసుబ్బయ్య, వెంకటరాముడు, ప్రసాద్ పాల్గొన్నారు.

## టీబీ వ్యాధిపై నిర్లక్ష్యం తగదు



రికార్డులను పరిశీలిస్తున్న అధికారి పీటర్

చాగలమర్రి, జూలై 21(ఆంధ్రజ్యోతి) : టీబీ వ్యాధి లక్షణాలున్న వ్యక్తులు నిర్లక్ష్యం చేయడం తగదని జిల్లా టీబీ నివారణ అధికారి పీటర్ తెలిపారు. సోమవారం చాగలమర్రి ప్రభుత్వ వైద్యశాలలో రికార్డులను పరిశీలించారు. జిల్లాలో నెలకు 250 టీబీ కేసులు నమోదవుతున్నాయని ఆయన అన్నారు. ముక్తి అభియాన్ పథకాన్ని ఉపయోగించుకోవాలన్నారు. వ్యాధి లక్షణాలున్న వారికి ఆరు నెలలకు సరిపడే మందులను ఉచితంగా అందజేస్తారన్నారు. వైద్యులు ఇమ్రాన్, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఫార్మసిస్టు రాజేష్, ల్యాబ్ టెక్నీషియన్ నాయక్ పాల్గొన్నారు.

## ఎస్సీ కార్పొరేషన్ నిధులు విడుదల చేయాలి

బనగానపల్లె, జూలై 21 ( ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ నిధులు విడుదల చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పూలరాజు కోరారు. సోమవారం తహసీల్దారు నారాయణరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఎస్సీ సబ్‌ప్లాన్‌నిధులు వెంటనే విడుదల చేయాలన్నారు. భూమిలేని ఎస్సీలకు ఐదు ఎకరాల భూమిని పంపిణీ చేయాలని కోరారు.

## రుద్రవరంలో 65 ఎంఎం వర్షపాతం నమోదు

- పంట పొలాల్లో నిలిచిన నీరు



మొక్కజొన్న పంటలో నిలిచిన వర్షంనీరు

రుద్రవరం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం మండలంలో ఆదివారం రాత్రి 65 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు సోమవారం తెలిపారు. పంట పొలాల్లో వర్షం నీరు నిలిచింది. చెరువుల పొంగిపొర్లాయి. మొక్కజొన్న, మినుము పంట పొలాల్లో వర్షం నీరు నిలిచింది. రైతులు ఆందోళన చెందుతున్నారు.



## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అవుకు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : అవుకు, గుండ్లశింగవరం, ఉప్పలపాడు గ్రామాల పరిధిలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ పక్కీరయ్య సోమవారం తెలిపారు. మూడు విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు చేపడుతామన్నారు.

## ఘనంగా ఉమామహేశ్వరస్వామి పల్లకీ సేవ

బనగాన పల్లె, జూలై 21 ( ఆంధ్రజ్యోతి): మండలంలోని యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పల్లకీ సేవ ఉత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈవో పాండు రంగారెడ్డి, పూజారులు, యాగంటిపల్లె ఉపసర్పంచ్ మౌళీశ్వరరెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

## రేషన్ సకాలంలో పంపిణీ చేయండి

కోవెలకుంట్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అందించే నిత్యావసర వస్తువులను పేదలకు సకాలంలో పంపిణీ చేయాలని తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో డీలర్లు, వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 8గంటల నుంచి రేషన్‌షాపులు తెరువాలన్నారు. ప్రతి ఒక్కరూ తప్పక నిబంధనలు పాటించాలన్నారు. సమావేశంలో డీటీ నాగేశ్వర్‌రెడ్డి, ఆర్ఐ, సీనియర్ అసిస్టెంటు పుల్లయ్య, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

## సాగులో మెలకువలు పాటించాలి

కోవెలకుంట్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : పంటల సాగులో మెలకువలు పాటించి అధిక దిగుబడులు సాధించుకోవాలని నంద్యాల వ్యవసాయ సంచాలకులు సరళమ్మ అన్నారు. సోమవారం మండలంలోని భీమునిపాడు రైతు సేవా కేంద్రంలో రైతులకు పంటల సాగుపై శిక్షణ ఇచ్చారు. సమావేశంలో వ్యవసాయాధికారి హేమసుందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆయకట్టుకు సాగునీరు

చాగలమర్రి, జూలై 21(ఆంధ్రజ్యోతి) : రాజోలి ఆనకట్ట పరిధిలోని 82 వేల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యమని కేసీ కెనాల్ ఏఈ జమాల్ వలి తెలిపారు. సోమవారం రాజోలి ఆనకట్ట వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. 20వ బ్లాక్ నుంచి నీరు కుందూలో ప్రవహిస్తుండడంతో నీటిమట్టం పెరిగిందన్నారు. ఆనకట్ట నుంచి కేసీ ప్రధాన కాల్వకు 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామన్నారు. రైతులు నీటిని వృథా చేయకూడదన్నారు. ఆయన వెంట సూపర్‌వైజర్ దస్తగిరి ఉన్నారు.

## చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

ఆళ్లగడ్డ, జూలై 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి బాగా చదువు కోవాలని పట్టణ సీఐ యుగంధర్ సూచించారు. సోమవారం పట్టణంలోని విశ్వశాంతి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం, సైబర్ క్రైం, లోన్ యాప్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కరస్పాండెంట్ శ్రీనాథ్‌రెడ్డి, టౌన్ ఎస్ఐ జయ్యప్ప, అధ్యాపకులు పాల్గొన్నారు.

## యాగంటిలో సాయిబాబా ధర్మప్రచార రథం

బనగానపల్లె, జూలై 21 ( ఆంధ్రజ్యోతి): మండలంలోని యాగంటి క్షేత్రానికి సోమవారం పుట్టపర్తి సాయిబాబా ధర్మ ప్రచార రథం చేరుకుంది.అర్చకులు ధర్మప్రచార రథానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సాయిబాబా భక్తులు మాట్లాడుతూ పుట్టపర్తి సాయిబాబా అందించిన సనాతనా ధర్మాన్ని, ఆయన బోధనలను, సేవలను ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



రాస్తారోకో నిర్వహిస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు

బేతంచెర్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ఎల్లయ్య అన్నారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా రోడ్డుపై కార్మికులతో రాస్తారోకోను సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, పట్టణ నాయకులు రామాంజనేయులు మాట్లాడుతూ ప్రజలు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నా కూడా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని మృతి చెందిన కార్మికులకు రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు కాశీ, జలీల్, నాగన్న, అఖిల్, విజయ్, శ్రీను, రాజు, చందు, మద్దయ్య పాల్గొన్నారు.

## 24న చౌడేశ్వరీ దేవి జయంతి

బేతంచెర్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని కొలుములపల్లె రోడ్డులో వెలసిన చౌడేశ్వరి దేవి అమ్మవారి జయంతి ఉత్సవాలను ఈ నెల 24న వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. ఉదయం పూజలు, సాయంత్రం రథోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు హాజరై జయప్రదం చేయాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

## పంటమార్పిడితో అధిక దిగుబడులు

దొర్నిపాడు, జూలై 21(ఆంధ్రజ్యోతి) : రైతులు పంట మార్పిడి చేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ చెన్నయ్య తెలిపారు. సోమవారం దొర్నిపాడు వ్యవసాయ కార్యాలయంలో ఏవో ప్రమీల ఆధ్వర్యంలో రైతులకు పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంటలు వేసేముందు మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవాలన్నారు. సేంద్రీయ ఎరువులను వినియోగించాలన్నారు. సమావేశంలో ఏవో వెంకటేశ్వరరెడ్డి, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకుందాం

డోన్ రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకోకపోతే ఉపాధ్యాయుల ఉనికికే ప్రమాదం ఏర్పడుతుందని యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు వెంకటసుబ్బారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని చిన్నమల్కాపురం పాఠశాలలో యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం కొచ్చెర్వు హెచ్ఎం వెంకటసుబ్బారెడ్డిని ఉపాధ్యాయులు సన్మానించారు. నాయకులు సుబ్బరాయుడు, లక్ష్మినాయక్, ప్రసాదెరెడ్డి పాల్గొన్నారు.

## చెంచుగూడెంలో వాటర్ ట్యాంకు నిర్మాణం

రుద్రవరం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్నయ్యస్వామి చెంచుగూడెంలో రూ.36లక్షలతో చేపట్టిన వాటర్‌ట్యాంకు పనులు ప్రారంభించినట్లు సోమవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రమణ్యం తెలిపారు. 40వేల లీటర్ల సామర్థ్యంతో ట్యాంకును నిర్మిస్తున్నట్లు వివరించారు. అలాగే పైపులైను ఏర్పాటు చేస్తున్నట్లు ఏఈ తెలిపారు. చెంచులకు రక్షిత మంచినీరు అందించడమే లక్ష్యమన్నారు.

## మొక్కలు నాటుదాం

రుద్రవరం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మొక్కలు నాటి పచ్చదనాన్ని అందిద్దామని ఆ దర్శ ప్రిన్సిపాల్ నాగేశ్వ ర్‌రావు అన్నారు. సోమవారం పాఠశాల వద్ద నాటారు. మొక్కలను సంరక్షించే బాధ్యత విద్యార్థులదేనన్నారు. ఉపాధ్యాయులున్నారు.

## బైకును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- ఒకరు మృతి.. మరొకరికి గాయాలు

ప్యాపిలి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌బీఐ సమీపంలో సోమవారం ఆర్టీసీ బస్సు మోటారు బైకును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణంలోని చాకలిగేరికి చెందిన ప్రసాద్(32), సుధాకర్ బైకుపై బస్టాండ్‌కు బయలుదేరారు. మార్గం మధ్యలోని ఎస్‌బీఐ సమీపంలో రోడ్డు క్రాస్ చేస్తుండగా గుత్తి వైపు నుంచి కర్నూలు వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ప్రమాదవశాత్తు బైకును ఢీ కొట్టింది. దాంతో ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందగా, సుధాకర్‌కు తీవ్రగాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్త కర్నూలు తరలించారు. ప్రసాద్‌కు భార్య లత, కూతురు, కుమారుడు ఉన్నారు. ఇంటి పెద్దదిక్కు మృతి చెందడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదచాయలు అలుముకున్నాయి. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుసూదన్ తెలిపారు.